

గూగుల్‌కు 480 ఎకరాలు



- యాదవ్ భవన్‌కు 2 ఎకరాలు
- మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గూగుల్ డేటా సెంటర్‌కు అవసరమైన భూములు కేటాయించేందుకు రాష్ట్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోదం తెలిపింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో అడవివరం, తర్లువాడ, రాంబిల్లిలో 480 ఎకరాలు ఇవ్వనున్నారు. ఈ భూములను ... మిగతా 6వ పేజీలో

ఆ

భోగాపురం విమానాశ్రయం ప్రారంభమయ్యేలోగా పూర్తిచేస్తాం

జాబితాలో...అడవివరం-శొంఠ్యాం, బోయపాలెం-కాపులుప్పాడ, నేరెళ్లవలస-తాళ్లవలస, వేపగుంట-పినగాడి రోడ్లు

4 రహదారులపై ఫోకస్

[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

- టీడీఆర్‌లకు ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ డెస్క్
- ప్రాజెక్టుల పర్యవేక్షణకు పీఎంయూ
- 3వ తేదీన మాస్టర్ ప్లాన్ ఫైనల్ డ్రాఫ్ట్ సమర్పణ
- మ్యూజియాల సందర్శనకు ప్రత్యేక టూర్ ప్యాకేజీ
- 'ఆంధ్రజ్యోతి'తో వీఎంఆర్‌డీఏ ఎంసీ తేజ్ భరత్


తేజ్ భరత్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

భోగాపురం విమానాశ్రయం ప్రారంభమయ్యేలోగా ముఖ్యమైన నాలుగు మాస్టర్‌ప్లాన్ రహదారులను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ తెలిపారు. ఆయన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వచ్చేలోగా మొత్తం 15 మాస్టర్ ప్లాన్ రహదారులు వేయాలని ప్రతిపాదించామని, అందులో ఏడు ముందుగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టామన్నారు.

విమానాశ్రయం నిర్మిస్తున్న జీఎంఆర్ ప్రతినిధులు వచ్చి ముందుగా అత్యంత ప్రధానమైన నాలుగు రహదారులు (అడవివరం-శొంఠ్యాం, బోయపాలెం-కాపులుప్పాడ, నేరెళ్లవలస-తాళ్లవలస, వేపగుంట-పినగాడి) రహదారులను పూర్తిచేయాలని కోరడంతో...వాటిపైనే దృష్టి కేంద్రీకరించామన్నారు. ఈ మాస్టర్‌ప్లాన్ రహదారుల పర్యవేక్షణకు అధికారులతో ప్రత్యేకంగా ఒక బృందాన్ని ఏర్పాటుచేశామని, ఒక ప్లానింగ్ ఆఫీసర్ నాయకత్వంలో ఈ బృందం పనిచేస్తుందన్నారు. ఒక్కో ఏఈకి ఒక్కో రహదారి అప్పగించామని, వాటిలో జాప్యం జరిగితే వారే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇంకా కమిషనర్ ఏమన్నారంటే...

వీఎంఆర్‌డీఏలోనే ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ డెస్క్

మాస్టర్ ప్లాన్ రహదారులకు సంబంధించి సేకరించిన భూముల రిజిస్ట్రేషన్, వాటికి టీడీఆర్‌లు ఇవ్వడం, ఎంఐజీ ప్లాట్ల రిజిస్ట్రేషన్, తదితర ... మిగతా 6వ పేజీలో

నేడు వీఎంఆర్‌డీఏ బోర్డు సమావేశం

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) బోర్డు సమావేశం శనివారం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో వర్చువల్‌గా అమరావతి అధికారులు పాల్గొంటారు. మొత్తం 25 అంశాలు బోర్డులో పెడుతున్నారు. కైలాసగిరిపై ఏర్పాటు చేయనున్న త్రిశూలం, ఢమరుకం ప్రాజెక్టుకు అదనంగా మరో రూ.2.5 కోట్లు కావాలని ప్రతిపాదిస్తున్నారు. వచ్చే ఫిబ్రవరిలో విశాఖపట్నంలో నేవీ ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ నిర్వహించనున్న నేపథ్యంలో వీఎంఆర్‌డీఏకు చెందిన పార్కులు, మ్యూజియాలను అందంగా తీర్చిదిద్దడానికి అవసరమైన పనులు ప్రతిపాదిస్తున్నారు. ఇలా అనేక అంశాలు చర్చించి నిర్ణయం తీసుకుంటారు. ఇక్కడి నుంచి ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ తేజ్ భరత్, తదితరులు పాల్గొంటారు.

నేడు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాక

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ శనివారం నగరానికి రానున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 4.30 గంటలకు విశాఖపట్నం రానున్నారు. విమానాశ్రయం నుంచి నేరుగా తూర్పు నౌకాదళంలోని అతిథి గృహానికి వెళతారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని సాయంత్రం 5.50 గంటలకు ఐఎన్ఎస్ సముద్రికలో తూర్పు నౌకాదళం ఏర్పాటుచేసే కార్యక్రమానికి హాజరవుతారు. రాత్రి ఎనిమిది గంటలకు అక్కడ నుంచి విమానాశ్రయానికి చేరుకుని, 8.30 గంటలకు హైదరాబాద్ బయలుదేరి వెళతారు.

హాట్‌కేకుల్లా అమ్ముడైన వన్డే టికెట్లు



విశాఖపట్నం-స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య డిసెంబరు 6న ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్న అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడైపోయాయి. శుక్రవారం ఉదయం ఆన్‌లైన్‌లో డిస్ట్రిక్ బై జొమాటో యాప్ ద్వారా చేపట్టిన అమ్మకాలకు క్రీడాభిమానుల విశేష స్పందన లభించింది. విక్రయాలు ప్రారంభమైన గంటల వ్యవధిలోనే రూ.1,200, 2,000, 2,500, 3,000, 3,500, 4,000, 5,000 శ్రేణి ధరల టికెట్లు అయిపోయాయి. మరికొద్దిసేపటికే రూ.10,000 టికెట్లు కూడా అమ్ముడైపోయాయి. ఇక సాయంత్రం వరకు ... మిగతా 6వ పేజీలో

ఐకానిక్ టవర్స్‌పై గందరగోళం



పెదరుషికొండలో 50 అంతస్థులతో ఆరు టవర్స్ నిర్మించేందుకు వీఎంఆర్‌డీఏ ప్రణాళిక

- ఆర్‌పీఎఫ్‌కు కానరాని స్పందన
- ప్రముఖ సంస్థతో ఒప్పందం జరిగినట్టు సోషల్ మీడియాలో ప్రచారం
- అటువంటిదేమీ లేదన్న ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్
- మరోసారి ప్రకటన ఇచ్చేందుకు యోచిస్తున్నట్టు వెల్లడి

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) పెదరుషికొండలో నిర్మించ తలపెట్టిన 50 అంతస్థుల ఐకానిక్ టవర్స్ నిర్మాణంపై సోషల్ మీడియాలో రకరకాలుగా ప్రచారం జరుగుతోంది. దీనిని ఖండించాల్సిన అధికారులు మౌనంగా ఉంటున్నారు. దాంతో ఇది ఉద్దేశపూర్వక ప్రచారమా?... అనే అనుమానం కలుగుతోంది.

రాష్ట్రంలో అత్యంత ఎత్తైన అంటే 50 అంతస్థుల భవన నిర్మాణానికి వీఎంఆర్‌డీఏ ఈ ఏడాది జూలైలో ప్రణాళిక రూపొందించుకుంది. పెబ్బల్స్ బీచ్ అపార్టుమెంట్ పక్కన (ఐటీ పార్కు దగ్గర) సర్వే నంబరు 331/1లో 4.07 ఎకరాల్లో ఐకానిక్ టవర్స్ నిర్మించాలనేది ఆలోచన. ఆరు ఐకానిక్ టవర్లు డిజైన్ చేశారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా అనుమతి ఇచ్చింది. జాయింట్ వెంచర్/పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో చేపట్టాలని రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్‌పీఎఫ్) పిలిచారు. అందులో 3 బీహెచ్‌కే, 4 బీహెచ్‌కే, 4 బీహెచ్‌కే డ్యూప్లెక్స్ ఫ్లాట్లు ఉంటాయి. క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్, చిల్డ్రన్ ప్లే ఏరియా, పూల్ డెక్, సైకిల్ ట్రాక్, జాగింగ్ ట్రాక్, తదితర అత్యాధునిక వసతులు ఉంటాయి. అయితే ఈ ఆర్‌పీఎఫ్‌కు ఒకేఒక్క దరఖాస్తు వచ్చింది. నగరంలోని సీతమ్మధారలో ఆక్సిజన్ టవర్స్ ఉన్నాయి. అవి రెండు టవర్స్, 36 అంతస్థులు. వీఎంఆర్‌డీఏ నిర్మించ తలపెట్టింది ఆరు టవర్లు, 50 అంతస్థులు. భారీ పెట్టుబడి కావాలి. ఇది లాభదాయకంగా ఉంటుందా?, ఉండదా?..అనే అనుమానంతో ఎవరూ ముందుకురాలేదు. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే ప్రైవేటు సంస్థలు అనేక అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాల నిర్మాణం ప్రారంభించాయి. డిమాండ్‌కు మించి ప్రాజెక్టులు నడుస్తున్నాయి. వాస్తవం ఇలా ఉండగా...ఈ ప్రాజెక్టును నగరంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ దక్కించుకుందని, వారే నిర్మాణం చేపడతారంటూ సోషల్ మీడియాలో వారం రోజులుగా వైరల్ అవుతోంది. దీనిని వీఎంఆర్‌డీఏ అధికారులు ఎవరూ ఖండించడం లేదు.

కైలాసగిరిపై అంటూ మరో ప్రచారం

ఇటీవల నగరంలో నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సు ముగిసిన మరుసటిరోజు ... మిగతా 6వ పేజీలో

పూలేకు ఘన నివాళి



అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం నేతలు, అధికారులు ఘన నివాళి అర్పించారు. జిల్లా కోర్టు వద్ద గల పూలే విగ్రహానికి కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పూలమాల వేసి, అంజలి ఘటించారు.

రైల్వే స్టేషన్‌కు మరో రూ.300 కోట్లు

- ప్లాట్‌ఫారాల సంఖ్య 14కు పెంపు, ముఖద్వారం రూపురేఖలు మార్పు
- త్వరలోనే జోన్‌కు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్
- ఎంపీ ఎం.శ్రీభరత్
- 'డెక్'లో దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం పనులు పరిశీలన
- ప్రారంభోత్సవానికి సీఎంను ఆహ్వానించనున్నట్టు వెల్లడి


దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయంలో జీఎం ఛాంబర్


కార్యాలయం పనులను పరిశీలిస్తున్న ఎంపీ శ్రీభరత్, రైల్వే అధికారులు

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రైల్వేస్టేషన్ అభివృద్ధికి మరో రూ.300 కోట్లతో పనులు చేపట్టనున్నారని ఎంపీ ఎం.శ్రీభరత్ వెల్లడించారు. సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ డెక్‌లో దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ముడసర్లోవలో శాశ్వత భవన నిర్మాణ పనులు చురుగ్గా ... మిగతా 6వ పేజీలో

పంచాయతీల విభజన

- ఉత్తర్వులు విడుదల
- జిల్లాలో మూడు నుంచి నాలుగు వరకూ విభజన?

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల పునర్విభజనకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనికి సంబంధించి పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఆయా పంచాయతీల ప్రజల కోర్కె మేరకు ప్రతిపాదనలు రూపొందించి పంపాలని తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు వైసీపీ ప్రభుత్వం గత పంచాయతీ ఎన్నికల ముందు ఉమ్మడి జిల్లాలో కొన్ని పంచాయతీలను విభజించి కొత్తవి ఏర్పాటుచేసింది. వచ్చే ఏడాది మార్చితో ప్రస్తుత పంచాయతీ పాలకవర్గాల గడువు ముగియనున్నది. అనంతరం ఎన్నికలకు కసరత్తు చేస్తున్న ప్రభుత్వం అంతకంటే ముందుగా పంచాయతీల విభజన చేయాలని నిర్ణయించింది. పంచాయతీ కేంద్రానికి దూరంగా ఉన్న గ్రామాలతో పాటు ఎక్కువ జనాభా ఉన్నచోట పాలనా సౌలభ్యం కోసం కొత్త పంచాయతీలు ఏర్పాటుచేయాలనే డిమాండ్ ఉంది. విశాఖ జిల్లాలోని నాలుగు మండలాల పరిధిలో 79 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇటీవల పంచాయతీలకు గ్రేడింగ్ ప్రతిపాదించిన నేపథ్యంలో కొత్తగా నాలుగైదు కొత్త పంచాయతీల ఏర్పాటుకు ... మిగతా 6వ పేజీలో

ఉత్పత్తి పెంచకుంటే మనుగడ కష్టం

- రోజుకు 19 వేల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేయాలి
- సామర్థ్యం 92.5 శాతానికి పెరగాలి
- బ్యాంకుల రుణాలతో పెరిగిన వడ్డీల భారం
- ప్రతి నెలా రూ.100 కోట్ల లాభాలు రావలసిందే
- ఇకపై కేంద్రం సాయం చేయడం కష్టం
- ఉక్కు ఉద్యోగుల సమావేశంలో మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీల ప్రకటన



విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):

స్టీల్‌ప్లాంటులో రోజుకు 19 వేల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి తీస్తేనే మనుగడ ఉంటుందని, లేదంటే కష్టమని ఉక్కు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీలు శుక్రవారం స్పష్టంచేశారు. ఢిల్లీ నుంచి జాయింట్ సెక్రటరీలు అభిజిత్ చక్రవర్తి, దయానిధన్ పాండేలు రాగా సీఎండీ ఏకే సక్సేనా దశల వారీగా ఉద్యోగులకు నాలుగు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్లాంటు పరిస్థితులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

బ్యాంకుల నుంచి రుణాలు భారీగా తీసుకున్నందున వడ్డీల భారం పెరిగిందని, ప్లాంటు ఉత్పత్తి సామర్థ్యం 92.5 శాతానికి చేరితేనే ఆర్థిక ఫలితాలు బాగుంటాయని వెల్లడించారు. లాభాలు పెంచాలని, ఇవి ప్రతి నెలా రూ.100 కోట్లు ఉంటేనే రుణాలకు తిరిగి చెల్లింపులు చేయగలుగుతామన్నారు. ప్లాంటులో ఉత్పత్తి స్థిరంగా ఉండాలని, కన్వేయర్ బెల్ట్‌ల బ్రేక్ డౌన్‌లు లేకుండా చూడాలని సూచించారు. ఆపరేషన్లలో ఇబ్బందులు లేకుండా ఉద్యోగులే బాధ్యత తీసుకోవాలన్నారు. బ్లాస్ట్ ఫర్నేస్‌లకు కోక్ సమస్య ఉందని అంగీకరించారు. అమ్మకాలు కూడా పెంచాలని, అన్ని విభాగాల్లో వ్యయాలు తగ్గించాలని సూచించారు. ఇకపై కేంద్రం నిధులు ఇచ్చే అవకాశం లేదని, ఉత్పత్తి లక్ష్యాలు సాధించకపోతే కష్టాలు తప్పవని పరోక్షంగా హెచ్చరించారు.

కన్వేయర్ బెల్ట్‌ల నిర్వాకం ఉద్యోగులదేనని సీపీకి ఫిర్యాదు

నవంబరు నెలలో ... మిగతా 6వ పేజీలో


ఆడ శిశువుకు జన్మనిచ్చిన మహిళ

రైలులో ప్రయాణిస్తుండగా పురిటినొప్పులు

- విశాఖ స్టేషన్‌లో దించి అత్యవసర వైద్యం అందించిన రైల్వే డాక్టర్, సిబ్బంది
- అంబులెన్స్‌లో ప్రసవం... ఆడ శిశువు జననం

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైలులో పురిటి నొప్పులతో బాధపడిన ఓ మహిళ విశాఖ స్టేషన్‌లో సిబ్బంది సురక్షితంగా దించి అత్యవసర వైద్య సేవలందించడంతో ఆడ శిశువును ప్రసవించింది. గురువారం ఎర్నాకులం-హటియా ఎక్స్‌ప్రెస్ (22838)లో ప్రయాణిస్తున్న గర్భిణికి ప్రసవ నొప్పులు రావడంతోపాటు రక్తస్రావం అవుతున్నట్టు సమాచారం అందుకున్న విశాఖ రైల్వే సిబ్బంది, డాక్టర్ భాషిణి ప్రియాంక అప్రమత్తమయ్యారు. రాత్రి 11.40 గంటల సమయంలో రైలు విశాఖకు చేరుకోగానే గేట్-1 వద్ద సిద్ధంగా ఉంచిన అంబులెన్స్‌లోకి తరలించారు. అప్పటికే నొప్పులు, రక్తస్రావం ఎక్కువ కావడంతో డాక్టర్ భాషిణి ప్రియాంక, వైద్య సిబ్బంది అంబులెన్స్‌లోనే ... మిగతా 6వ పేజీలో

రేషన్ డిపోల్లో రాగులు పంపిణీ

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రేషన్ డిపోల్లో డిసెంబరు ఒకటో తేదీ నుంచి బియ్యం కార్డుదారులకు ఉచితంగా మూడుకిలోల రాగులు (మూడు కిలో బియ్యానికి బదులు) పంపిణీ చేయనున్నట్టు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. ప్రజలకు పోషకాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కార్డుదారులకు సంబంధించి ప్రతి యూనిట్‌కు ఐదు కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తారని, అయితే బియ్యానికి బదులు ప్రతి కార్డుపై మూడు కిలోల రాగులు అందజేసేలా డిపోల్లో ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. వినియోగదారులు డిపోలకు వెళ్లినప్పుడు బియ్యం బదులు రాగులు తీసుకోవాలన్నారు.


చంద్రంపాలెం ఉన్నత పాఠశాల సమీపంలో తీసిన గొయ్యి

చంద్రంపాలెంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం

మధురవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం నిర్మించే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఇంజనీరింగ్ అధికారులు శుక్రవారం శ్రీకారం చుట్టారు. పిల్లర్లు వేయడానికి జేసీబీలతో గోతులు తవ్వించి, మట్టి నమూనాలు సేకరించారు. తొలుత మట్టి నమూనాలను పరీక్షించనున్నట్టు అధికారులు వెల్లడించారు. పరీక్షల్లో వచ్చిన నివేదిక ఆధారంగా పనులను ప్రారంభించనున్నారు. వంతెన నిర్మాణానికి జీవీఎంసీ రూ.3.43 కోట్లు మంజూరుచేసిన విషయం తెలిసిందే.

కమనీయం..సింహాద్రినాథుని నిత్య కల్యాణం



సింహాచలం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్ర పుష్పం,కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

బిజినెస్ ఇన్నోవేషన్స్‌పై ముగిసిన సదస్సు

సాగర్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో సుస్థిర సమాజ అభివృద్ధికి సరికొత్త వాణిజ్య నమూనాలు అన్న అంశంపై రెండు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా ముఖ్యఅతిథిగా హాజరై సదస్సులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ప్రస్తుత కాలంలో సరికొత్త వాణిజ్య నమూనాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. స్టార్టప్ సంస్కృతి కూడా పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్, సదస్సు నిర్వాహక కమిటీ ఛైర్మన్ ప్రొఫెసర్ రాజా.పి. పప్పు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే

తగరపువలస, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా. పి. శ్రీవాణి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలని సూచించారు. చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి. రత్న భారతి మాట్లాడుతూ చదువుతో పాటు నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకున్నప్పుడే పోటీ ప్రపంచంలో నెగ్గుకు రాగలమన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

నిత్యాన్నదానానికి వస్తు సామగ్రి బహూకరణ

సింహాచలం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని కన్నతల్లి ట్రాన్స్‌పోర్టు ప్రతినిధులు పలు సామగ్రిని శుక్రవారం బహూకరించారు. 500 భోజన ప్లేట్లు, తాగునీటికి 500 గ్లాసులు, నాలుగు క్యారేజీలను అన్నప్రసాద విభాగం ఏఈఓ రమణమూర్తి, పర్యవేక్షణాధికారి పాలూరి నరసింగరావుకు అందజేశారు.

కార్మిక సంఘాలతో సమావేశం వాయిదా

తగరపువలస, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వచ్చే నెల 2న చిట్టివలస జూట్‌మిల్లు కార్మిక సంఘాలు, యాజమాన్య ప్రతినిధులతో లేబర్ కమిషనర్ నిర్వహించాల్సిన సమావేశం డిసెంబరు 4వ తేదీకి వాయిదా వేశారు. ఈ విషయాన్ని అన్ని కార్మిక సంఘాల నాయకులకు లేబర్ కమిషన్ అధికారులు సమాచారం పంపించారు. 4న మధ్యాహ్నం 2 గంటలకు ఈ సమావేశం జరుగుతుందన్నారు.

ఆ 4 రహదారులపై ఫోకస్

... 5వ పేజీ తరువాయి

పనుల్లో జాప్యం జరుగుతున్నట్టు గుర్తించాం. ఏదైనా రిజిస్ట్రేషన్ 48 గంటల్లో పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నాం. దీనికోసం వీఎంఆర్‌డీఏ భవనంలోనే రిజిస్ట్రేషన్ల శాఖ సిబ్బందితో ఒక డెస్క్ ఏర్పాటు చేసి, ఇక్కడే ఆ పనులు పూర్తిచేస్తాం.

ప్రాజెక్టు మానటరింగ్ యూనిట్

సుమారు పదిహేను వరకూ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటిని సకాలంలో పూర్తిచేయడానికి ప్రాజెక్టు మానటరింగ్ యూనిట్ (పీఎంయూ) ఒకటి ఏర్పాటు చేస్తాం. అదేవిధంగా అధునాతన సాంకేతిక అంశాలు అమలు చేయడానికి ఐటీ సెల్‌ను కూడా పెడుతున్నాం.

మాస్టర్ ప్లాన్‌పై కసరత్తు పూర్తి

మాస్టర్ ప్లాన్-2040లో మార్పులకు సంబంధించి అభ్యంతరాలు ఆహ్వానిస్తే 3,500 దరఖాస్తులు వచ్చాయి. వాటన్నింటినీ పూర్వ ఎంసీ విశ్వనాథన్ పరిశీలించి, నివేదిక తయారుచేశారు. దానిని డిసెంబరు 3న విజయవాడ ఉన్నతాధికారులకు సమర్పిస్తాం. ఆ తరువాత దాన్ని పబ్లిక్ డొమైన్‌లో పెట్టి, మళ్లీ అభ్యంతరాలు తీసుకొని ఫైనల్ మాస్టర్ ప్లాన్ ఖరారు చేస్తాం.

టూర్ ప్యాకేజీలు

వీఎంఆర్‌డీఏకు ఆదాయం పెంచడానికి, పర్యాటక స్థలాలకు డిమాండ్ తీసుకురావడానికి స్వయంగా సంస్థ ద్వారా టూర్ ప్యాకేజీలు ఏర్పాటుచేస్తాం. విద్యార్థులకు వీఎంఆర్‌డీఏకు చెందిన అన్ని మ్యూజియాలు (కురుసుర, టీయూ-142, సీ హ్యారియర్, యుహెచ్-3 హెచ్, తెలుగు మ్యూజియం) చూపించి చిల్డ్రన్ ఎరీనాకు తీసుకువచ్చి మధ్యాహ్న భోజనం పెట్టి, అక్కడే కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఇలా నెలలో 15 రోజులు చిల్డ్రన్ ఎరీనాను పిల్లల కార్యక్రమాలతో ఎంగేజ్ చేస్తాం. ఆదాయం పెరుగుతుంది. పిల్లలకు అవగాహన కలుగుతుంది. ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల్లో కొంత సిబ్బంది కొరత ఉంది. సచివాలయాల సిబ్బందిని తీసుకొని పని చేయించుకోవాలని యోచిస్తున్నాం. శనివారం జరిగే వీఎంఆర్‌డీఏ బోర్డు సమావేశంలో మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటాం.

హాట్‌కేకుల్లా అమ్ముడైన వన్డే టికెట్లు

... 5వ పేజీ తరువాయి

కార్పొరేట్ బాక్స్ రూ.15,000, షూట్ రూ.18,000 ధర టికెట్లు అందుబాటులో ఉండగా, రాత్రి 9.00 గంటల సమయంలో రూ.18,000 టికెట్లు కూడా కనిపించలేదు. మిగిలిన కార్పొరేట్ బాక్స్ రూ.15,000 టికెట్లు మాత్రం రాత్రి 10.00 గంటలకు అందుబాటులో ఉన్నట్టు వెబ్‌సైట్‌లో చూపించింది. స్టేడియం సామర్థ్యం మేరకు 22 వేల టికెట్లు అమ్మకానికి పెడుతున్నట్టు ఏసీఏ ప్రతినిధులు ప్రకటించారు. అయితే ఏ ధర టికెట్లు ఎన్ని (డినామినేషన్) అనే వివరాలను వెల్లడించలేదు. రూ.1,200 టికెట్లు నిమిషాల వ్యవధిలోనే అయిపోవడంతో సగటు క్రీడాభిమానులు నిరుత్సాహానికి గురయ్యారు.

రైలులో ప్రయాణిస్తుండగా పురిటినొప్పులు

... 5వ పేజీ తరువాయి

సాధారణ ప్రసవాన్ని విజయవంతంగా చేయించగలిగారు. తల్లి, బిడ్డ ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉన్న నేపథ్యంలో వారిని తదుపరి చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అప్రమత్తంగా వ్యవహరించి సాధారణ ప్రసవం చేయడంతోపాటు తల్లీబిడ్డలను కాపాడేలా సేవలందించిన డాక్టర్ భాషిణి ప్రియాంక బృందాన్ని వాల్తేరు డీఆర్ఎం లలిత్ బొహ్రా అభినందించారు.

గూగుల్‌కు 480 ఎకరాలు

... 5వ పేజీ తరువాయి

గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్‌కు ఇస్తారు. అలాగే ముడసర్లోవలో యాదవ్ భవన్ నిర్మాణానికి రెండు ఎకరాలు కేటాయించడానికి కూడా మంత్రివర్గం ఆమోదించింది. ఎకరా రూ.12.1 కోట్లు చొప్పున రెండు ఎకరాలకు రూ.24.2 కోట్లు చెల్లించాలని సూచించింది.

వైకుంఠ ఏకాదశికి పక్కాగా ఏర్పాట్లు

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- సింహాచలం దేవస్థానం ఈఓ సుజాత



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ సుజాత

సింహాచలం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 30న జరిగే అప్పన్న స్వామి ఉత్తరద్వార దర్శనం (వైకుంఠ ఏకాదశి) ఉత్సవాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని దేవస్థానం ఈఓ ఎస్. సుజాత కోరారు. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని శుక్రవారం ఆమె దేవస్థానం అధికారులతో సింహగిరిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైదికులు నిర్ణయించిన సమయానికే ఉత్తర ద్వారంలో తొలుత అనువంశిక ధర్మకర్త కుటుంబీకులకు స్వామి వారి దర్శనం కల్పించి అనంతరం ఉత్తర రాజగోపురంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పుష్ప వేదికపై భక్తులకు ముందుగా ప్రకటించిన సమయానికే వైకుంఠనాథుని దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఉత్తర ద్వారంలో స్వామివారిని భక్తులంతా వీక్షించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయ ఆవరణలో ఉచిత ప్రసాద పంపిణీకి సన్నాహాలు చేసుకోవాలని అన్నప్రసాద విభాగం సిబ్బందికి తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు, స్థానాచార్యులు రాజగోపాల్, డిప్యూటీ ఈఓ సింగం రాధ, ఏఈఓ రమణమూర్తి, తిరుమలేశ్వరరావు, పలు విభాగాల పర్యవేక్షణాధికారులు, ఈఈ సీహెచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

శ్రీవిద్యా కోటి కుంకుమార్చన మహాయజ్ఞం ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

సాగర్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న ఓ కన్వెన్షన్ హాల్‌లో స్వామి అభిషేక్ బ్రహ్మచారి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే శ్రీవిద్యా కోటి కుంకుమార్చన మహాయజ్ఞం కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీఎన్‌వీ మాధవ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రగతి, ప్రపంచ శాంతి, పేదల సంక్షేమం కోసం ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. స్వామి అభిషేక్ బ్రహ్మచారి దేశవ్యాప్తంగా ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమని తెలిపారు. విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి సమష్టి కృషి అవసరమన్నారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ సనాతన ధర్మం గొప్పతనాన్ని వివరించారు. జ్యేష్ఠ స్వామి అభిషేక్ బ్రహ్మచారి మాట్లాడుతూ తల్లి లలితా ఆరాధనతో మహాయజ్ఞం ప్రారంభమైందన్నారు. మహా యజ్ఞం రెండు రోజుల కుంకుమార్చనలో ఐదు వేల మంది మహిళలు భక్తులు లలితా సహస్ర నామ మంత్రాన్ని పది మిలియన్ సార్లు పఠిస్తారని వెల్లడించారు. 34 ప్రధాన నగరాల్లో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు.

జ్యోతిరావు పూలేకు నివాళి



పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

సింహాచలం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పేదల ఆశాజ్యోతి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని సేవలందించిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని సింహాచలంలోని బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి. పురుషోత్తం అన్నారు. పూలే వర్ధంతి పురస్కరించుకుని శుక్రవారం ఆ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల సంక్షేమానికి పూలే చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు.

వైభవంగా అమ్మవార్ల తిరువీధి



తిరువీధి ఉత్సవంలో దేవరులు

సింహాచలం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అప్పన్నస్వామి దేవేరులు సువర్ణ తాయరు, చతుర్భుజి తాయార్ అమ్మవార్ల తిరువీధి ఉత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచారు. ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలాపనలు, పండితుల వేద పఠనాల నడుమ ఆలయ బేడా మండపంలో తిరువీధి జరిపారు. భక్తులు మార్గమధ్యలో అష్టదిక్పాలకులకు ప్రత్యేక పూజలు చేసి, కర్పూర నీరాజనాలు, నివేదనలు సమర్పించారు.

పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు



ఎండాడలో విద్యార్థుల ఇంటికి వెళ్లిన ఉపాధ్యాయులు



సింగనబందలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడిన అనంతరం విద్యార్థులకు సూచనలు ఇస్తున్న లక్ష్మీపురం ఉపాధ్యాయులు

భీమునిపట్నం / భీమునిపట్నం (రూరల్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు అన్న కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. శుక్రవారం లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలహెచ్ఎం డి. సత్యారావు, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, రవిశేఖర్ పట్నాయక్, ఈశ్వరరావు, సత్యనారాయణ, ఆర్. అప్పలరాజు బృందంగా ఏర్పడి సింగనబంద గ్రామాన్ని సందర్శించారు. పాఠశాలలో చదువుతున్న విద్యా ర్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. పాఠశాల విడిచిపెట్టిన తర్వాత ఇంటికి వచ్చిన విద్యార్థులతో చదివించాలని చెప్పారు. తాళ్లవలస ఉన్నత పాఠశాల హెచ్ఎం రమేశ్, ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. భీమునిపట్నంలో నెహ్రూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారు ఏ విధంగా చదువుతున్నారో పరిశీలించారు. నాలుగో వార్డు పరిధిలోని మంగమారిపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం సాయంత్రం విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను కలుసుకున్నారు. విద్యార్థులను ఇంటి వద్ద దగ్గర ఉండి చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వి. పద్మావతి, ఎంఈఓ జయప్రద తదితరులు పాల్గొన్నారు.



భీమిలిలో బాలికకు పాఠ్యాంశాల్లోని సందేహాలను నివృత్తి చేస్తున్న టీచర్

ఎండాడ : పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యంతో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చేస్తున్న కృషికి అనుగుణంగా ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఎండాడ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం సాయంత్రం విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పరీక్షలకు ఏమేరకు చదువుతున్నారు. వారికి కావాల్సిన మెటీరియల్ సూచనలు, సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి. ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

సేవాభావంతోనే నర్సింగ్ వృత్తిలో రాణింపు



సదస్సులో పాల్గొన్న వైద్యులు

ఎండాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సహనం, సేవాభావంతో నర్సింగ్ వృత్తి చేపట్టాలని, అప్పుడే వృత్తిలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని ఐఎన్‌హెచ్‌సీ కల్యాణి (నేవల్ ఆస్పత్రి) ప్రిన్సిపాల్ కల్నల్ లలికుట్టి థామస్ అన్నారు. గీతం వర్సిటీ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశం పొందిన విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాన్ని ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య ఆరోగ్య రంగం విస్తరిస్తున్న కొద్ది నర్సింగ్ వృత్తికి డిమాండ్ పెరుగుతోందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ వృత్తికి అధిక ప్రాధాన్యత ఉందని చెప్పారు. జిమ్సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. గీతాంజలి మాట్లాడుతూ నర్సింగ్ విద్యలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడం గీతం లక్ష్యమన్నారు. గీతం నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. వెంకటేశన్ బాలు మాట్లాడుతూ ఏపీ, కేరళ, తమిళనాడు, ఒడిశా, మణిపూర్, పశ్చిమబెంగాల్ నుంచే కాకుండా నేపాల్ వంటి దేశాల నుంచి వచ్చిన విద్యార్థినులు తమ వద్ద చదువుతున్నారని వెల్లడించారు. అనంతరం విద్యార్థినులు వృత్తిని అంకితభావంతో చేపడతామని కొవ్వొత్తులతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిమ్సర్ డీన్ డాక్టర్ ఎస్వీ రావు, బయో కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ విశ్వకల్యాణ్, నర్సింగ్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఉత్పత్తి పెంచకుంటే మనుగడ కష్టం

... 5వ పేజీ తరువాయి

కన్వేయర్ బెల్ట్‌లు మూడుసార్లు తెగిపోయాయి. దీనివల్ల ఉత్పత్తి తగ్గిపోయింది. ఉద్యోగులే కావాలని బెల్ట్‌ను కోసేస్తున్నారంటూ యాజమాన్యం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. దాంతో ఆయన శుక్రవారం ప్లాంటుకు వచ్చి అన్నీ పరిశీలించారు. అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓ మహిళా అధికారిణి మాట్లాడుతూ స్టీల్ ప్లాంటు ఉద్యోగులు ఇలాంటి తప్పుడు పనులు చేయరని, నిర్వహణ లేకే అవి తెగిపోతున్నాయని వివరించారు. యాజమాన్యం మాత్రం ఎన్నడూ లేనిది ఇప్పుడే ఎందుకు తెగుతున్నాయని వాదించింది. కాంట్రాక్టు కార్మికులను వేల సంఖ్యలో తగ్గించేసి, నిర్వహణకు నిధులు ఇవ్వడం ఆపేస్తే ఏ యంత్రాలైనా ఇలాగే అవుతాయని అధికార వర్గాలు వాదిస్తున్నాయి. ఈ సందర్భంగా జరిగిన చర్చలో అధికారుల సంఘం నాయకుడు ఒకరు బ్లాస్ట్ ఫర్నేస్‌ల సమస్యను ప్రస్తావించగా, ఇప్పుడు దానిపై చర్చ వద్దని, కేవలం కన్వేయర్ బెల్ట్‌లపైనే మాట్లాడాలంటూ సమావేశాన్ని ముగించి జాయింట్ సెక్రటరీలు వెళ్లిపోయారు. వారు వచ్చిన విషయం స్థానిక ఎంపీకి కూడా సమాచారం లేదని, యాజమాన్య ప్రతినిధులు ఉద్యోగులను దోషులుగా చిత్రీకరిస్తున్నారని, ఈ విధానం మానుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అవసరమైన ముడి పదార్థాలు ఇవ్వకుండా 92.5 శాతం యుటిలైజేషన్ ఏ విధంగా సాధ్యమవుతుందో యాజమాన్యమే చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ రేవళ్లపాలెం, మధురవాడ ఫీడర్ల నిర్వహణ పనుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు డీఈ సింహాచలం నాయుడు తెలిపారు. రేవళ్లపాలెం, పోలీస్ స్టేషన్, భాస్కర్‌నగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

భీమునిపట్నం : కాపులుప్పాడ విద్యుత్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిపివేయనున్నారు. మంగమారిపేట, తిమ్మాపురం, గొల్లల తిమ్మాపురం ప్రాంతాలకు సరఫరా ఉండదు.



సదస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

వైద్యుడు భగవంతుడితో సమానం

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సాగర్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వైద్యుడు భగవంతుడుతో సమానమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. హోటల్ రాడిసన్ బ్లూలో మూడు రోజుల పాటు జరిగే 59వ ఇండియన్ ఆర్థోడెంటల్ సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూతల స్వర్గం, ఆర్థిక రాజధాని అయిన నగరంలో ఈ సదస్సు నిర్వహించడం, దేశ, విదేశాల నుంచి 2500 వైద్యులు పాల్గొనడం అభినందనీయమన్నారు. అధునాతన వైద్య విధానాలను ప్రజలకు అందించడానికి ఇటువంటి సదస్సులు ఉపయోగపడతాయని చెప్పారు. ఐఓఎస్ ఇండియాలోనే అతి పెద్ద సంస్థ అని, నగరంలో వారి కార్యకలాపాలు నిర్వహణకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యే కె. రాజేశ్వరరెడ్డి, కాన్ఫరెన్స్ ఛైర్మన్ శ్రీకృష్ణ, ఐఓఎస్ ప్రెసిడెంట్ పునీత్‌బాత్రా, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

కొమ్మాది, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు దాటేటప్పుడు విద్యార్థులు చాలా జాగ్రత్తగా ఉండాలని, రహదారి భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని విశాఖ బ్రేక్ ఇన్‌స్పెక్టర్ రాజారావు సూచించారు. శుక్రవారం ఆయన పీఎంపాలెంలోని మాలతాంబా విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులకు, బస్సు డ్రైవర్లకు వేర్వేరుగా రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు జి. సత్యనారాయణ, వి.వర ప్రసాద్, ప్రిన్సిపాల్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో మండల ప్రత్యేకాధికారి పర్యటన



అంగన్‌వాడీ సిబ్బందితో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారిణి జ్ఞానవేణి

పద్మనాభం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రెడ్డిపల్లి పంచాయతీలో మండల ప్రత్యేకాధికారిణి జ్ఞానవేణి శుక్రవారం పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, సచివాలయాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. వారి సంరక్షణ పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రాథమిక పాఠశాలను సందర్శించి, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. సచివాలయానికి వెళ్లి రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం అప్పగించిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు ఈఓపీఆర్‌డీ రమణ. పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

అధికారులతో సమావేశం

మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారిణి జ్ఞానవేణి పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.గ్రామాల్లో పారిశుధ్యం పనులు, తాగునీటి వనరుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై సమీక్ష జరిపారు. స్వామిత్ర సర్వే, రైతన్న మీ కోసం కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో జయ ఉమా, ఈవోపీఆర్‌డీ రమణ, ఏవో చలం పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌కు మరో రూ.300 కోట్లు

... 5వ పేజీ తరువాయి

జరుగుతున్నాయని, అవి 2027 ఫిబ్రవరి నాటికి పూర్తవుతాయన్నారు. ఈలోగా జోన్ కార్యకలాపాల నిర్వహణకు డెక్‌లో ఆరు, ఏడు అంతస్థులు తీసుకున్నారని, ఆరో అంతస్థులో ఆఫీసు నిర్మాణ పనులు పూర్తయ్యాయని, ఏడో అంతస్థులో పనులు ప్రారంభించారన్నారు. జోన్ ఆపరేషన్‌కు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ త్వరలోనే వస్తుందని ఎంపీ ఆశాభావం వ్యక్తంచేశారు. వాల్తేరు డివిజన్‌ను రెండుగా విడగొట్టడం వల్ల కొన్ని సాంకేతిక సమస్యలు వచ్చాయని, వాటి వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా ఉండేలా ఎలా చేయాలా?...అనే దానిపై రైల్వే బోర్డు ఆలోచన చేస్తోందన్నారు. డెక్‌లో జోన్ కార్యాలయం ప్రారంభోత్సవానికి సీఎం చంద్రబాబునాయుడును ఆహ్వానిస్తామని, రైల్వే మంత్రి కూడా వర్చువల్‌గా పాల్గొంటారన్నారు. ఈ కార్యాలయంలో మొత్తం 250 మంది అధికారులు పనిచేస్తారని, వారిలో 100 మంది ఉన్నత స్థాయి అధికారులు, మరో 60 మంది జాయింట్ సెక్రటరీ స్థాయి అధికారులు ఉంటారని, ఇది చాలా కీలకంగా ఉంటుందని ఎంపీ వ్యాఖ్యానించారు.

14 ప్లాట్‌ఫారాలకు పెంపు

రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు మొదలయ్యాయని, పాత డిజైన్ ప్రకారం కాంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగించారని, అయితే ప్లాట్‌ఫారాల సంఖ్య 14కు పెంచాలని, స్టేషన్ ముఖద్వారం రూపురేఖలు కూడా మార్చాలని రైల్వే బోర్డు సూచించిందన్నారు. వాటికి సంబంధించిన ప్రతిపాదనలు పంపించారని, వాటికి ఆమోదం లభిస్తే ఇంకో రూ.300 కోట్లతో మరిన్ని పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈలోగా ప్రయాణికులకు అవసరమైన వసతులు, తదితరాల పనులన్నీ పూర్తిచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ తేజ్‌భరత్, సెక్రటరీ మురళీకృష్ణ, జాయింట్ కమిషనర్ రమేశ్, సీఈ వినయకుమార్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ఐకానిక్ టవర్స్‌పై గందరగోళం

... 5వ పేజీ తరువాయి

(16వ తేదీ) ఆదివారం ఉదయం 7 గంటలకు పురపాలక శాఖా మంత్రి నారాయణ వీఎంఆర్‌డీఏలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో ఆయన కైలాసగిరిపై 50 అంతస్థుల ఐకానిక్ టవర్ నిర్మిస్తున్నామని, దీనికి అనుమతులు కూడా ఇచ్చామని చెప్పినట్టు సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై తొలుత జిల్లా అధికారుల ప్రకటన కూడా ఆ విధంగానే విడుదలైంది. ఆ తరువాత నాలుక కరుచుకొని 'కైలాసగిరి' అనే పదం తొలగించారు. అంతే తప్ప ఆ ప్రాజెక్టు వచ్చే ఏరియా ఏమిటో స్పష్టత ఇవ్వలేదు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టుపై జరుగుతున్న ప్రచారం గురించి వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ వద్ద ప్రస్తావించగా, దీనిపై త్వరలోనే ప్రకటన విడుదల చేస్తామన్నారు. ఎవరికీ ఈ ప్రాజెక్టును అప్పగించలేదని, మరోసారి ప్రకటన ఇచ్చే అవకాశం ఉందన్నారు.

పంచాయతీల విభజన

... 5వ పేజీ తరువాయి

అవకాశాలున్నాయని చెబుతున్నారు. నగరానికి ఆనుకుని కొన్ని పంచాయతీలు ఆస్తి పన్ను రూపేణా ఏడాదికి రూ.కోటికి మించి ఆదాయం సమకూర్చుకుంటున్నాయి.నగర విస్తరణ, ఐటీ కంపెనీల రాక, తదితర పరిణామాలను దృష్టిలో పెట్టుకుని కొన్నిచోట్ల పంచాయతీల విభజనకు నేతలు పట్టుబడుతున్నారు. ప్రజా ప్రతినిధుల ద్వారా కొత్త పంచాయతీల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. కొత్త పంచాయతీల ఏర్పాటుచేసే సమయంలో సంబంధిత పంచాయతీ పరిధిలో గ్రామసభ నిర్వహించి ప్రజల అభిప్రాయాలను తీసుకోవాల్సి ఉంటుంది. తాజాగా జీవో కూడా విడుదల కావడంతో జిల్లాలో కొత్త పంచాయతీల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులు నిర్ణయించారు.

అస్తవ్యస్త పార్కింగ్‌తో అవస్థలు

» సిరిపురం సెంటర్ నుంచి సర్క్యూట్ హౌస్‌కు వెళ్లే దారిలో వాహనదారుల ఇక్కట్లు
» బస్టాపులు సైతం ఆక్రమణ



ప్రయాణికులు వేచి ఉండేందుకు అవకాశం లేకుండా బస్టాప్ వద్ద వాహనాల పార్కింగ్



నో పార్కింగ్ బోర్డు పెట్టిన చోటనే నిలిపిన వాహనాలు

సిరిపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సిరిపురం సెంటర్ నుంచి సర్క్యూట్ హౌస్‌కు వెళ్లే దారికి ఇరువైపులా వాహనాల పార్కింగ్‌తో వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న ప్రైవేటు కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు తమ ద్విచక్రవాహనాలను రోడ్డు పక్కనే పార్కింగ్ చేసి రోజంతా అదే చోట వదిలేస్తున్నారు. ఆ దారిలో వెళ్లే ఆర్టీసీ సిటీ బస్సులు నిలిపేందుకు ఏర్పాటు చేసిన షెల్టర్లకు సైతం అడ్డంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీనివల్ల బస్టాప్ వద్ద నిలబడేందుకు ప్రయాణికులకు అవకాశమే లేకుండా పోతోంది. సర్క్యూట్ హౌస్ నుంచి సిరిపురం వైపునకు వెళ్లే దారిలో కొంతమంది దుకాణదారులు తమ వాహనాలను బస్టాప్‌నకు అడ్డంగా నిలుపుతున్నారు. దీంతో అక్కడ బస్టాప్ నిరుపయోగంగా మారింది. సిరిపురం సర్కిల్‌లో ట్రాఫిక్ పోలీసు చెక్‌పోస్టు ఉంది. ఇక్కడ నిత్యం ట్రాఫిక్ పోలీసులు విధుల్లో ఉంటారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులను అడ్డగించి జరిమానా వే యడమే తమ విధి అన్నట్టుగా వ్యవహరిస్తుంటారు. అంతేతప్ప, మిగతా ట్రాఫిక్ సమస్యలపై దృష్టిపెట్టడం లేదని ఈ దారుల్లో ప్రయాణించేవారు అంటున్నారు. రోడ్లనే పార్కింగ్ ప్రదేశాలుగా చేసుకుంటున్న వారు ఇక్కడి ట్రాఫిక్ సిబ్బందికి కనిపించటం లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఏదైనా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురైన తరువాత హడావిడి చేసే కంటే, ముందుగానే మేల్కొని ఇక్కడ అడ్డదిడ్డంగా నిలుపుతున్న వాహనాలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విద్యా వ్యవస్థపై రాద్ధాంతం తగదు

» వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్



సిరిపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యా వ్యవస్థపై వైసీపీ నాయకులు అనవసర రాద్ధాతం చేస్తే సహించేది లేదని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ట్రాప్‌లో విద్యార్థి సంఘాలు పడద్దని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా వ్యవస్థను సమూల ప్రక్షాళన చేసి, అనేక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏనాడూ పట్టించుకోని, వైసీపీ నాయకులు, ప్రస్తుతం విద్యార్థుల ముసుగులో రోడ్డెక్కి ఆందోళనలు చేస్తుండడం సిగ్గుచేటన్నారు. విద్యార్థి నాయకులు, విద్యార్థుల ముసుగులో ధర్నాలు చేస్తే, తాము చూస్తూ ఊరుకోబోమన్నారు. విద్యార్థుల సమస్యలు ఏమైనా ఉంటే వాటిని పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 21 వినతులు


వినతులను స్వీకరిస్తున్న సీసీపీ ప్రభాకరరావు

వెంకోజీపాలెం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి నగర వ్యాప్తంగా 21 వినతులు వచ్చినట్టు జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. జీవీఎంసీ సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా సీసీపీ మాట్లాడుతూ స్వీకరించిన వినతులను/ ఫిర్యాదులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు.

బ్రెయిన్ ఫీవర్‌పై అవగాహనా సదస్సు

రామ్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బ్రెయిన్ ఫీవర్ అనేది మెదడు వెన్నెముకను కప్పి ఉంచే పొరలు వాపు చెందడం వల్ల వచ్చే తీవ్రవ్యాధి అని, దీనిపై అప్రమత్తత, అవగాహ న అవసరమని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ డీవీ ప్రియాంక పేర్కొన్నారు. శుక్రవారం దసపల్లా హిల్స్‌లోని ఒక సమావేశ మందిరంలో పిల్లల్లో బ్రెయిన్ ఫీవర్ వ్యాధి గురించి అవగాహన కల్పించారు,

సినిమా గైడ్

● **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడీ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం),
● **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
● **12ఎ రైల్వే కాలనీ** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతా రామయ్య (పరవాడ),
● **రాజు వెడ్స్ రాంబాయి/మఫ్టీపోలీసు** : జగదాంబ
● **శిసు/రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
● **పాంచ్‌మినార్/ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
● **ది గర్ల్ ఫ్రండ్** : శ్రీకన్య కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 48, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 70, బెండకాయలు 52, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 48, బీరకాయలు 44, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 22, క్యారెట్ 54, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 90,అల్లం (పాతది) 70, బరబాటి 46, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 56, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 46, కీరదోస 26, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 26, చిలగడ దుంపలు 36, కంద 50, దేముడుచిక్కుడు 70, గోరు చిక్కుడు 54, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 180, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 70, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు	
బ్రాగ్	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

ఏపీ పెట్రో కెమికల్స్ భద్రతా చర్యలకు జాతీయ గుర్తింపు

సిరిపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వృత్తిపరమైన భద్రత, ఆరోగ్య భద్రతా చర్యల అమలులో ఏపీ పెట్రో కెమికల్స్ లిమిటెడ్ అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. జాతీయ సేఫ్టీ కౌన్సిల్ ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి నిర్వహించిన సర్వేలో ఆంధ్ర ప్రదేశ్ పెట్రో కెమికల్స్ ఉత్పత్తిరంగంలో వృత్తిపరమైన, అలాగే ఆరోగ్యపరమైన భద్రతా చర్యల్లో చూపుతోన్న శ్రద్ధను జాతీయ సేఫ్టీ కౌన్సిల్ గుర్తించింది. న్యూఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఏపీ పెట్రో కెమికల్స్ లిమిటెడ్ అధ్యక్షుడు కె.నరసప్ప ప్రతిష్ఠాత్మక ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. శుక్రవారం ఈ విషయాన్ని ఏపీ పెట్రోకెమికల్స్ లిమిటెడ్ హెచ్ఆర్ జనరల్ మేనేజర్ పీఎస్ఎన్ మూర్తి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇది తమ సం స్థకు మరింత గర్వకారణమని పేర్కొన్నారు.

ఛాతీ ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ప్రారంభం


ఉచిత వైద్య సేవలను ప్రారంభిస్తున్న డాక్టర్ సంధ్యారాణి, వాణి, సునీల్ కుమార్, ఇతర వైద్యులు

పెదవాల్తేరు, నవంబరు (ఆంధ్ర జ్యోతి) : చినవాల్తేరులోని ప్రభుత్వ ఛాతి ఆసుపత్రిలో సూపర్ స్పెషాలి టీ ఉచిత వైద్య సేవల ప్రత్యేక విభాగాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులు గా ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యారాణి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, డాక్టర్ సునీల్ కుమార్ పాల్గొని సూపర్ స్పెషాలిటీ ఉచిత వైద్య సేవలను ప్రారంభించారు. అనం తరం వారు మాట్లాడుతూ ఎంతో మంది పేదవారికి ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు ఇక్కడ అందుతున్నాయని తెలిపా రు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ హర్ష, నర్సింగ్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూలో మహాత్మా జ్యోతిరావు పూలేకు ఘన నివాళులు


మహాత్మా జ్యోతిరావు పూలేకు నివాళులు అర్పిస్తున్న వీసీ రాజశేఖర్, పలువురు ఆచార్యులు

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా యూనివర్సిటీలో శుక్రవారం మహాత్మా జ్యోతీరావు పూలే వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.. బయోకెమిస్ట్రీ విభాగం వద్ద జరిగిన కార్యక్రమంలో వీసీ జీపీ రాజశేఖర్ పాల్గొని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్త్రీ విద్య కోసం మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన సేవలు మరువరానివన్నారు. నేటి తరం ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో రెక్టార్ పి.కింగ్, రిజిస్ట్రార్ కె. రాంబాబు, ప్రిన్సిపాల్స్, డీన్స్, ఇతర ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

16వ వార్డులో వైసీపీ కోటి సంతకాల సేకరణ


మాట్లాడుతున్న కురసాల కన్నబాబు, పాల్గొన్న కె.కె.రాజు, మాజీ మేయర్ హరివెంకటకుమారి తదితరులు

వెంకోజీపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డు ఇసుకతోటలోని రజకవీధి సామాజిక భవనంలో వైసీపీ విశాఖ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉత్తరాంధ్ర వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి తదితరులు పాల్గొని మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యా రంగాన్ని, వైద్యరంగాన్ని నిర్లక్ష్యం చేయడం దురదృష్టకరమని విమర్శించారు. ఇందులో భాగంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా జరిగిన రచ్చబండ కార్యక్రమంలో ప్రజాభిప్రాయాలను సేకరించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నడింపల్లి కృష్ణంరాజు, వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 23, 24 తేదీల్లో పీసా మహోత్సవ్

» 10 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు, కళాకారులు హాజరు
» కేంద్ర పంచాయతీరాజ్ సంయుక్త కార్యదర్శి ముక్తా శేఖర్


అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ముక్తా శేఖర్. చిత్రంలో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పీసా (పంచాయతీస్ ఎక్స్‌టెన్షన్ టూ షెడ్యూల్ ఏరియాస్)-1996 చట్టం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చేనెల 23, 24 తేదీల్లో విశాఖ వేదికగా వేడుకలు (పీసా మహోత్సవ్) నిర్వహిస్తున్నట్టు కేంద్ర పంచాయతీరాజ్ సంయుక్త కార్యదర్శి ముక్తా శేఖర్ వెల్లడించారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఎం.కృష్ణతేజతో కలిసి ఆమె శుక్రవారం హోటల్ గ్రాండ్‌బేలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రెండు రోజులపాటు జరగనున్న మహోత్సవ్‌లో పది రాష్ట్రాల నుంచి క్రీడాకారులు, కళాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఖేల్ ఇండియా ఆధ్వర్యంలో కబడ్డీ, ఇంకా ఇతర క్రీడా పోటీలు ఉంటాయన్నారు. నగరంలోని పోర్టు స్టేడియంలో ఈ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ మాట్లాడుతూ ఈ ఉత్సవ్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాల్గొంటారని తెలిపారు. మహోత్సవంలో భాగంగా 23వ తేదీ ఉదయం ఆర్కే బీచ్‌రోడ్డులో పది కిలోమీటర్ల మారథాన్ నిర్వహించనున్నామని వెల్లడించారు. డిసెంబరు 22వ తేదీ నుంచే క్రీడా పోటీలు కొనసాగుతాయని, 24న గ్రామ స్వరాజ్ పేరుతో వర్క్‌షాపులు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతోపాటు పుస్తకావిష్కరణ ఉంటుందన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని అధికారులు ఏర్పాట్లుచేయాలని సూచించారు. మహోత్సవ్ బ్రాండింగ్‌కు సంబంధించి చర్యలు తీసుకోవాలన్నారు. మారథాన్‌లో పాల్గొనే క్రీడాకారులకు అందించే టీషర్టుల రూపకల్పన, ఇంకా ప్రచారం కోసం హోర్డింగ్‌లు, ఎలక్ట్రానిక్ బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి ఎంఎన్వీ శ్రీనివాసరావు, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి జాన్ గాలియట్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే నిర్మాణ వ్యర్థాలు


మద్దిలపాలెం దేవి ప్లాజా ఎదురుగా నిర్మాణ వ్యర్థాలు

మద్దిలపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం గాయత్రి స్కూల్ రోడ్డు దేవీ ప్లాజా ఎదురుగా నిర్మాణ వ్యర్థాలు గుట్టలుగా పోశారు. పది రోజులు కావస్తున్నా వ్యర్థాలను తొలగించకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపై చెత్త వేస్తే జరిమానాలు వేస్తున్న జీవీఎంసీ అధికారులు, సిబ్బంది రోడ్ల మీద నిర్మాణ వ్యర్థాలను కుప్పలుగా పోస్తున్న వారిపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. జీవీఎంసీ వార్డు పరిధి మద్దిలపాలెంలో ఈ సమస్య తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. ఎవరు ఇంటి రిపేర్లు చేసినా, పాత ఇల్లులు కూల్చిన వ్యర్థాలను రోడ్ల మీద కుప్పలుగా వేస్తున్నారు. చెత్త చెదారం తప్పితే నిర్మాణ వ్యర్థాలను జీవీఎంసీ సిబ్బంది తొలగించరు. ఇంటి పనులు చేసుకునే వారే డెబ్రిస్‌ను ఇతర నగర శివారుకు తరలించాలి. కానీ ఇక్కడ నిర్మాణదారులు తమకు పట్టనట్టు రోడ్డు మీద నిర్మాణ వ్యర్థాలను కుప్పలుగా వేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇరుకు రోడ్లల్లో వ్యర్థాలతో రాకపోకలు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. డెబ్రిస్ పోగులు వేసే వారిపైనా జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పదోన్నతి పొందిన ఆకాశవాణి అధికారులకు సన్మానం


రామ్‌గోపాల్‌ను సన్మానిస్తున్న ఆకాశవాణి అధికారులు, సిబ్బంది

సిరిపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రంలో పనిచేస్తున్న అధికారులకు పదోన్నతులు లభించాయి. ప్రోగామ్ ఎగ్జిక్యూటివ్‌లుగా పని చేస్తొన్న పీవీ రామ్‌గోపాల్, కాశీభట్ల ఇందిరకు అసిస్టెంట్ డైరెక్టర్ ప్రోగ్రామ్స్(ఏడీపీ)లుగా ప్రమోషన్ పొందారు. శుక్రవారం ఆకాశవాణి ప్రాంతీయ కార్యాలయ అధికారులు, సిబ్బంది అంతా కలసి పదోన్నతి పొందిన ఇరువురు అధికారులను సత్కరించి, అభినందనలు తెలిపారు. ఆల్ ఇండియో రేడియో కేంద్రంలో ప్రోగ్రామ్స్ ఇంజనీరింగ్, పరిపాలన విభాగాలు ఉండగా, చాలా కాలంలో ఇక్కడ పని చేస్తున్న వారికి పదోన్నతులు లభించలేదు. సీనియార్టీ మేరకు అన్ని విభాగాల్లో అందుబాటులో ఉన్న ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు ఏఐఆర్ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో పలువురు అధికారులు, సిబ్బందికి పదోన్నతులు లభిస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. పదోన్నతి లభించడం వల్ల మరింత బాధ్యతను పెంచిందని, ఆల్ ఇండియో రేడియో విశాఖపట్నం కేంద్రం ద్వారా శ్రోతలు మెచ్చేలా కార్యక్రమాలప్రసారాలకు ప్రాధాన్యం ఇస్తామని రామ్‌గోపాల్, ఇందిర పేర్కొన్నారు.

23వ వార్డులో యూజీడీ పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, పాల్గొన్న కార్పొరేటర్ విజయసాయి, పలువురు టీడీపీ నాయకులు, జీవీఎంసీ అధికారులు

మద్దిలపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 23వ వార్డులో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వార్డులో రూ.58 లక్షలతో యూజీడీ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ఇటీవల రూ.86 లక్షలతో నూతన రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు. స్థానిక ప్రజలకు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, టీడీపీ నాయకులు గుడ్ల సత్యారెడ్డి, గొలగాని పురుషోత్తం, బూస రాంబాబు, అచ్చి రమేష్ రెడ్డి, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

టెన్త్‌లో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

» కేడీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమతీబాయి


విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

పెదవాల్తేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు కేడీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.సుమతీబాయి తెలిపారు. విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు 2025-26 విద్యాసంవత్సంలో టెన్త్ విద్యార్థుల కోసం ఒక వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఈస్టు పాయింట్ కాలనీలోని కేడీపీఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సుమతిబాయి, ఉపాధ్యాయులు కలిసి పాఠశాల పరిధిలోని పెదవాల్తేరు, చినవాల్తేరు, శివాజీపాలెం తదితర ప్రాంతాలకు చెందిన పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. వారి పిల్లల చదువు తీరు పట్ల ఆరా తీశారు. పరీక్షల పట్ల అవగాహన కల్పించారు. రాబోయే మూడు, నాలుగు నెలలో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు తీసుకోవాల్సిన శ్రద్ధ, జాగ్రత్తలను వివరించారు. విద్యార్థి ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2 పరీక్షలలో వచ్చిన మార్కులను ఎస్సెస్‌మెంటు బుక్సులను చూపిస్తూ విద్యార్థి విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు తీసుకోవలసిన సూచనలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మణకుమారి, పి.శ్రీనివాసరావు, కె.సుజాత, కేవీఎస్ ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే జోన్ గెజిట్ నోటిఫికేషన్ ప్రకటించాలి

» ఎంపీ శ్రీభరత్‌కు రైల్వే జోన్ పోరాట సాధన సమితి వ్యవస్థాపక కన్వీనర్ చలసాని గాంధీ వినతి


ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న చలసాని గాంధీ, పక్కన వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ తేజ్‌భరత్

సిరిపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ కార్యకలాపాలు ప్రారంభించేలా వెంటనే గెజిట్ నోటిఫికేషన్ ప్రకటించాలని రైల్వే జోన్ పోరాట సాధన సమితి వ్యవస్థాపక కన్వీనర్ చలసాని గాంధీ కోరారు. శుక్రవారం వీఎంఆర్డీఏ డెక్ సెంటర్‌కు వచ్చిన ఎంపీ భరత్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. నాలుగు దశాబ్ధాల పోరాట ఫలితంగా కూటమి ప్రభుత్వ హయాంలో రైల్వే జోన్ ఏర్పాటుకు ఊపిరి పోసుకోవడం శుభపరిణామమన్నారు. డెక్ సెంటర్‌లో డివిజన్ కార్యాలయం ప్రారంభించడం ద్వారా మరో అడుగు ముందుకు పడిందని, అయితే దక్షిణ కోస్తా రైల్వేకు గెజిట్ నోటిఫికేషన్ విడుదలైతేనే ఇది కొలిక్కివచ్చినట్టవుతుందన్నారు. ఆ దిశగా ఎంపీ భరత్, కూటమి పెద్దలు కృషి చేయాలని కోరారు. కేంద్రంప్రభుత్వం స్పందించేలా రైల్వే జోన్ పోరాట సాధన సమితి ద్వారా కార్యకలపాలు కొనసాగిస్తామన్నారు. ఎంపీతో పాటు వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ తేజ్ భరత్ ఉన్నారు.

ఏయూ క్రీడల్లో పెన్‌కాక్ సిలాట్ చేర్చాలి

» వీసీ రాజశేఖర్‌కు జిల్లా కమిటీ వినతి



ఏయూ వీసీ రాజశేఖర్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తున్న పెన్‌కాక్ సిలాట్ జిల్లా అధ్యక్షుడు అడారి కిషోర్‌కుమార్, జిల్లా కమిటీ ప్రతినిధులు

మద్దిలపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రవిశ్వవిద్యాలయం క్రీడల్లో పెన్‌కాక్ సిలాట్ క్రీడను చేర్చాలని కోరుతూ పెన్‌కాక్ సిలాట్ జిల్లా అధ్యక్షుడు అడారి కిషోర్‌కుమార్, కార్యదర్శి ఎం.వెంకటరావు శుక్రవారం ఏయూ వీసీ జీపీ రాజశేఖర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ యూనివర్సిటీ గేమ్స్‌లో పెన్‌కాక్ సిలాట్‌ను చేర్చడానికి తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో మార్షల్ ఆర్ట్స్ ప్రత్యేక డెమో ప్రదర్శించడానికి అవకాశం కల్పిస్తామన్నారు. భవిష్యత్తులో పెన్‌కాక్ సిలాట్ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి టోర్నమెంట్లు ఏయూలో నిర్వహించేందుకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఏయూలో జరిగిన ఎన్‌సీసీ ఫార్మేషన్ డే కార్యక్రమంలో ఆకట్టుకునేలా ప్రదర్శనలు ఇచ్చిన వారిని అభినందించారు.

అంతర్జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్స్ విభాగంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి నెల 13, 14 తేదీల్లో 'మెరైన్ బయోడైవర్సిటీ అండ్ కన్జర్వేషన్' అంశంపై అంతర్జాతీయ సదస్సు జరుగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ శనివారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెక్టార్ పి.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య .రాంబాబు, మెరైన్ లివింగ్ రిసోర్స్ విభాగాధిపతి కె.రమేష్‌బాబు ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీకాల భైరవ స్వామికి పూజలు


స్వామికి అలంకరణ

డాబాగార్డెన్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీ కాలభైరవ స్వామికి కాలభైరాష్టమిని ఆలయ అర్చకులు గోపాజుశ్యుల సత్య జగన్నాథశర్మ వేదమంత్రాలతో సంప్రదాయరీతిలో ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలభైరవ స్వామివారికి పంచామృతాభిషేకం, హరిద్ర, కుంకుమ, గంధ, భస్మ అభిషేకాలు నిర్వహించారు. తదుపరి విశేష అలంకరణ చేసి శాస్త్రోక్తంగా అష్టభైరవ హోమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, పరిసర ప్రాంతవాసులు పాల్గొన్నారు. విచ్చేసిన వారికి తీర్థప్రసాదాలు, రక్షలను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ

సీతమ్మధార, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురు రోడ్డులో గల అభయ దుర్గాదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దుర్గాదేవి అంబలం పూజను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భవాని మాలధారులు, అయ్యప్ప స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి గీతాలను ఆలపించారు. అభయ దుర్గాదేవి ఆలయ కమిటీ, న్యూఫ్రెండ్స్ అసోసియేషన్ (దుర్గాకమిటీ) ప్రతినిధులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ గేమ్స్‌కు శర్మ, కిరణ్‌సాగర్

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఖేలో ఇండియా ఇంటర్ యూనివర్సిటీ గేమ్స్‌కు నగరానికి చెందిన ఎల్ఐసీ ఉద్యోగి డాక్టర్ డీవీఎస్‌వై.శర్మ, వాల్తేరు రైల్వే ఉద్యోగి దండు కిరణ్‌సాగర్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారు. జోధ్‌పూర్‌లో జరగనున్న టేబుల్ టెన్నిస్ టోర్నీకి బ్లూ బ్యాడ్జ్ అంతర్జాతీయ అంపైర్ డాక్టర్ శర్మ సాంకేతిక నిపుణిడిగా నియమితులయ్యారు. డిసెంబరు 1 నుంచి రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌లో జరగనున్న బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీకి అంతర్జాతీయ మాజీ బాక్సర్ దండు కిరణ్‌సాగర్ రిఫరీగా వ్యవహరిస్తారు. అంతర్జాతీయ, జాతీయ క్రీడాకారుల మధ్య జరగనున్న ప్రతిష్ఠాత్మక టేబుల్ టెన్నిస్ టోర్నీకి శర్మ అంపైర్‌గా నియమితులు కావడంపై ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదప్రసాద్ దాష్, మేనేజర్ పర్సనల్ డి.రామారావు, ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, టేబుల్ టెన్నిస్ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీకి కిరణ్‌సాగర్ రిఫరీగా వ్యవహరించడంపై బాక్సింగ్ సంఘం ప్రతినిధులు ఐ.వెంకటేశ్వరరావు, బి.అప్పన్నరెడ్డి అభినందనలు తెలిపారు.

మాధవధారలో ట్రెక్కింగ్ రేపు

మాధవధార, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పురాతన మాధవస్వామి ఆలయం నుంచి సింహాచల దేవస్థానం తోటల మీదుగా ఈ నెల 30న ట్రెక్కింగ్ నిర్వహించనున్నట్లు జీవీఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ జె.శ్రీధర్ తెలిపారు. శుక్రవారం పోస్టరును ఆవిష్కరించారు. ఆర్.కె. ఫిట్‌నెస్ జిమ్, ఎడిక్ట్ ఫిట్‌నెస్ జిమ్‌ల సంయుక్త నిర్వహణలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 'వ్యాయామం నిత్య జీవితంలో కీలకం' అనే అంశాన్ని ప్రజలకు మరింత చేరువగా తీసుకెళ్లేందుకు ఈ ట్రెక్కింగ్ ద్వారా అవగాహన చేపడుతున్నామని తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు మాధవధార కొండ సింహాచలం మెట్ల మార్గం నుంచి ట్రెక్కింగ్ కార్యక్రమం ఆరంభించనున్నట్లు తెలిపారు.

అంబేడ్కర్ భవన్‌లో 30న సదస్సు

సీతమ్మధార, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): లౌకిక, సోషలిస్టు పదాలను రాజ్యాంగం నుంచి తొలగించాలనే ప్రయత్నం జరుగుతోందని, ప్రజలందరినీ చైతన్యవంతులను చేయడానికి రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో భారతదేశ రాజకీయాలు, రాజ్యాంగ నైతికత డాక్టర్ అంబేడ్కర్ ఆలోచనలపై ఈ నెల 30న అంబేడ్కర్ భవన్‌లో సదస్సు నిర్వహిస్తున్నామని ఏఎంసీ కార్యదర్శి జె.వి.ప్రభాకర్ తెలిపారు. రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను సంఘం ప్రతినిధులు శుక్రవారం ఆవిష్కరించిన సందర్భంగా ప్రభాకర్ మాట్లాడారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. సంజీవయ్య కాలనీ, కైలాసపురం, శాంతినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాధవధార: జోన్-2లోని ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్‌లో శనివారం నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకేనాయుడు తెలిపారు. మాధవధార సీతన్న గార్డెన్స్, కళింగనగర్ ఫీడర్స్ పరిధిలో పనుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. మాధవధార సీతన్న గార్డెన్స్, కళింగనగర్, ఎంఎస్ఆర్ పార్క్, ఉడాకాలనీ ప్రాంతాలతో పాటు ఎన్ఏడీ దగ్గర ఫీడర్ పరిధిలోని కరాస ప్రాంతాల్లోనూ విద్యుత్ ఉండదని తెలిపారు.

గూగుల్‌కు 480 ఎకరాలు

... 5వ పేజీ తరువాయి

గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్‌కు ఇస్తారు. అలాగే ముడసర్లోవలో యాదవ్ భవన్ నిర్మాణానికి రెండు ఎకరాలు కేటాయించడానికి కూడా మంత్రివర్గం ఆమోదించింది. ఎకరా రూ.12.1 కోట్లు చొప్పున రెండు ఎకరాలకు రూ.24.2 కోట్లు చెల్లించాలని సూచించింది.

అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ
- విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో జాబ్‌మేళా


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ శ్రీభరత్, చిత్రంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్


మహిళా కళాశాలలో జాబ్‌మేళాకు హాజరైన యువతీ యువకులు

డాబాగార్డెన్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : యువత వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తద్వారా మరింత అభివృద్ధి చెందేందుకు ముందుకు వెళ్లాలని విశాఖ ఎంపీ శ్రీభరత్, దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పాత జైల్ రోడ్డులోని విశాఖ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి చాముండేశ్వరరావు ఆధ్వర్యంలో జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ ఐటీ, ఆటోమొబైల్, కెమికల్ ఫార్మసీ కంపెనీలు ఉద్యోగాలు కల్పించనున్నాయన్నారు. పెద్ద సంఖ్యలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. యువత ముందుగా ఉద్యోగంలో ప్రవేశించి, కొంతకాలానికి మరో కంపెనీకి మారిపోతున్నారని దీంతో ఆయా కంపెనీలు అవసరమైన మేరకే అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలోని రెండోసారి జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిన్న కంపెనీల్లో చేరితే నైపుణ్యం పెరుగుతుందని, తదుపరి అనుభవం ద్వారా మంచి స్థాయిలో ఉండవచ్చునన్నారు. రాబోయే కాలంలో ప్రతీ మూడు నెలలకోసారి జాబ్‌మేళా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, నిరుద్యోగులు పాల్గొన్నారు. జాబ్‌మేళాలో పాల్గొన్న వారికి అర్హతలను బట్టి ఎంపిక చేశారు.

మహాత్మ జ్యోతీరావు పూలేకు ఘన నివాళి



జ్యోతిరావు పులే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జనసేన పార్టీ నాయకులు

మహారాణిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతీరావు పూలేకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం జ్యోతీరావు పూలే వర్ధంతి సందర్భంగా జిల్లా కోర్టు ఎదుట ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా సమాజానికి పూలే చేసిన సేవలను స్మరించుకున్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడని, మహిళలు అక్షరాస్యులు కావడానికి విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. మానవతాన్ని పెంపొందించారని, ఆయన అడుగు జాడలు అందరికీ ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధికారిణి రాజేశ్వరి, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో...

సీతంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లోని నగర జనసేన పార్టీ కార్యాలయంలో సామాజిక సంస్కర్త జ్యోతిరావు పూలే వర్ధంతి సభను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సౌత్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివప్రసాద్, 27వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు గుండు సురేష్‌బాబు, 32వ వార్డు అధ్యక్షుడు అర్జున్, 31వ వార్డు ఇంచార్జ్ మర్రివేముల శ్రీనివాస్, 34వ వార్డు ఇంచార్జ్ నారా నాగేశ్వరరావు తదితరులు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంటరానితనం, మహిళా హక్కులు, కుల వ్యవస్థ నిర్మూలన వంటి అంశాలపై పోరాడిన సామాజిక సంస్కర్త జ్యోతీరావు పూలే అని శ్లాఘించారు. పార్టీ నాయకులు కోనూరి శ్రీనివాసరావు, దూది సతీష్, రవీంద్ర, జనసైనికులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలతోనే గుర్తింపు



ఆర్.వి.రమణను సత్కరిస్తున్న ఐటీఐల ప్రిన్సిపాల్స్,అధికారులు

కంచరపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఐటీఐల ఒకటో జోన్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు చేపట్టిన ఆర్.వి.రమణకు పారిశ్రామిక శిక్షణ శాఖ నుంచి జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించడంతో శుక్రవారం ఐటీఐల ప్రిన్సిపాల్స్, అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు సభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ప్రభుత్వ ఐటీఐల ప్రిన్సిపాల్స్ పాల్గొని సత్కరించారు. ఐటీఐల ప్రిన్సిపాల్‌గా, డిప్యూటీ డైరెక్టర్‌గా ఆర్.వి.రమణ అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మూడు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో ఈఎంజీ పరికరం ప్రారంభం


వైద్య పరికరాన్ని అందించిన ఎంపీ గొల్ల బాబూరావు

మహారాణిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లోని న్యూరాలజీ విభాగంలో ఎలక్ట్రోమయోగ్రఫీ పరికరాన్ని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు శుక్రవారం ప్రారంభించారు. తన ఎంపీ కోటా నిధి నుంచి రూ.15 లక్షలను అందించి కొనుగోలు చేసిన యంత్రాన్ని అప్పగించారు. ఈ వైద్య పరికరం ద్వారా నాడీ కండరాల వ్యాధులకు సంబంధించి మెరుగైన వైద్య సేవలు అందుతాయని, ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కేజీహెచ్ వైద్యాధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ రైతుల నడకలో పాల్గొని జయప్రదం చేయండి

- భారతీయ కిసాన్ సంఘం జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి

సీతమ్మధార, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ రైతులపై గౌరవం, ప్రకృతిపై ప్రేమను చూపించే పంటల రైతుల నడక కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భారతీయ కిసాన్ సంఘం జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి పిలుపునిచ్చారు. గురుద్వార సమీపంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 6 గంటలకు ఆర్‌కె బీచ్ కాళీమాత ఆలయం వద్ద నుంచి నడక ప్రారంభమవుతుందని, అందులో అందరు భాగస్వాములై మేళాకు శుభారంభం చేద్దామన్నారు. ఈ నడకలో పాల్గొనే విద్యార్థులకు సర్టిఫికేట్‌లు ఇస్తామన్నారు. డిసెంబరులో నిర్వహించే ఆర్గానిక్ మేళాను జయప్రదం చేయాలని కోరారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీరత్నం, రైతులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే పదిలో మెరుగైన ఫలితాలు


విద్యార్థిని ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు సూచనలిస్తున్న ఉపాధ్యాయులు


విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు

కంచరపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు మరింత ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు గృహ సందర్శన కార్యక్రమాన్ని జీవీఎంసీ కప్పరాడ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన స్టడీ అవర్స్ అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి చదువులపై ఆరా తీశారు. ప్రధానోపాధ్యాయుడు రాపర్తి శ్రీనివాసరావు నేతృత్వంలో ఉపాధ్యాయ బృందం పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లింది. ఇంటి వద్ద విద్యార్థులు చదువుతున్న తీరు, తల్లిదండ్రులు అందిస్తున్న ప్రోత్సాహం తదితర అంశాలపై ఆరా తీశారు. పిల్లలు ఈ మూడు నెలలు చక్కగా చదువుకోవడానికి కుటుంబ సభ్యులు తోడ్పాటు అందించాలని కోరారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరమేశ్వరరావు, పేరు నాయుడు, ఉష, సుజాత, సుంజయరావు, సన్యాసిరావు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

అక్కయ్యపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యం నిర్ణయించుకుని రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం సాయంత్రం గ్రామ, వార్డు సందర్శన కార్యక్రమాన్ని రైల్వేన్యూకాలనీలోని కేఎస్ఎం బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శాంతికుమారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. విద్యార్థులు ఇంటి వద్ద ఎలా చదువుతున్నారో తెలుసుకోవడంతో పాటు తల్లిదండ్రులతో పరీక్షల్లో వారి ప్రగతిపై చర్చించారు. క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా, ఇంటి దగ్గర ఉన్నప్పుడు టీవీ, సెల్ ఫోన్లను ఎక్కువ సేపు చూడకుండా నిరోధించాలని, తద్వారా కృతార్థులయ్యేందుకు తమవంతు కృషిచేయాలని కోరారు.

అశ్మిత్ ఖేలో ఇండియా అథ్లెటిక్స్ మీట్ లీగ్ పోటీలు


ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న శాయ్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మయాంక్ శ్రీనివాస తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): యువ అథ్లెట్లలో ప్రతిభను ప్రోత్సహించే ప్రక్రియలో భాగంగా భారత క్రీడాప్రాధికార సంస్థ (శాయి), అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ) సంయుక్తంగా నిర్వహిస్తున్న అశ్మిత్ ఖేలో ఇండియా అథ్లెటిక్స్ మీట్ లీగ్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కొమ్మాదిలోని శాప్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సులో జిల్లా అథ్లెటిక్స్ సంఘం నేతృత్వంలో అండర్-14, 16 బాలికలకు స్ప్రింట్స్, డిస్కస్ త్రో, షాట్‌పుట్, జావిలెన్ త్రో ఈవెంట్లలో జరుగుతున్న ఈ పోటీల్లో వివిధ పాఠశాలలు, అకాడమీల నుంచి సుమారు 160 మంది అథ్లెట్లు ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మయాంక్ శ్రీనివాస ముఖ్య అతిథిగా హాజరై రేస్ ఈవెంట్‌ను ప్రారంభించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జూన్ గ్యాలియట్, అథ్లెటిక్స్ సంఘం ప్రతినిధులు ఎం.నారాయణరావు, ఎంవి.పవన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో మెమరీ క్లినిక్

మహారాణిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అల్జీమర్స్ మెదడు సంబంధిత సమస్యతో బాధపడేవారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేజీహెచ్ మెమరీ క్లినిక్‌ను శుక్రవారం ప్రారంభించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఐ వాణి, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సంధ్యాదేవిలు జ్యోతి ప్రజ్వలన చేసి క్లినిక్‌ను ప్రారంభించారు. వృద్ధాప్యంలో జ్ఞాపక శక్తి తగ్గే విషయంలో అప్రమత్తంగా ఉండాలని వారు చెబుతూ, పేద, మధ్యతరగతి ప్రజలకు ఈ క్లినిక్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆర్ఎంవో డాక్టర్ శ్రీహరి, వైద్యులు రాజేష్, ఎస్.గోపి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

'అవినీతి కాంట్రాక్టర్లను ప్రోత్సహించడం తగదు'


జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

డాబాగార్డెన్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ మెకానికల్ విభాగం ఇంజనీరింగ్ అధికారులు అవినీతి కాంట్రాక్టర్లను ప్రోత్సహించేందుకు ప్రయత్నిస్తున్నారని జనసేన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ కేతన్‌గార్గ్‌ను కలిసి లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ చెత్త తరలింపు కేంద్రాల నుంచి సీసీఎస్ ప్రాజెక్టు ద్వారా చెత్త తరలించిన రాసా సంస్థ రూ.87 లక్షల అక్రమాలకు పాల్పడిందని అధికారులు గుర్తించారని తెలిపారు. నోటీసులు జారీ చేసినా, ఇప్పటి వరకు ఆయా నిధులు వసూలు చేయలేకపోతున్నారని తెలిపారు. కొత్తగా బాధ్యతలను రాసా సంస్థకు అప్పగించేలా ముగ్గురు మంత్రులు, ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులు జీవీఎంసీ కమిషనర్‌పై ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలిపారు. బ్లాక్‌లిస్టులో ఉన్న రాజరాజేశ్వరి సంస్థకు మరో కాంట్రాక్ట్ దక్కేలా అధికారులు ప్రయత్నించడం దారుణమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఈ అంశాలపై ప్రభుత్వం దృష్టిసారించాలని కోరుతున్నానని తెలిపారు.

భద్రత నిబంధనలను కచ్చితంగా పాటించాలి

- రీజనల్ ఫైర్ ఆఫీసర్ డి.నిరంజన్‌రెడ్డి


జ్యోతి వెలిగిస్తున్న రీజనల్ ఫైర్ ఆఫీసర్ డి.నిరంజన్‌రెడ్డి

డాబాగార్డెన్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని విశాఖపట్నం రీజనల్ ఫైర్ ఆఫీసర్ డి.నిరంజన్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో ఫైర్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో ఐఎఫ్ఎస్‌వై సదస్సు నిర్వహించారు. అగ్ని, జీవన భద్రతకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పరిశ్రమలు, నివాస భవనాలు, ఆస్పత్రుల్లోని అగ్ని భద్రతకు సంబంధించిన ఎన్‌బీసీ నిబంధనలను వివరించి, వాటిని కఠినంగా అమలు చేయడం ఎంతో అవసరమన్నారు. గౌరవ అతిథిగా ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ పి.శోభన్‌ప్రకాష్, ఎఫ్ఎస్ఏఐ జాతీయ అధ్యక్షుడు వి.శ్రీనివాస్, హేమంత్‌ఖడ్సే, అనుబ్బసెల్వన్ ప్రసంగించారు. ఎఫ్ఎస్ఏఐ విశాఖపట్నం చాప్టర్ అధ్యక్షుడు ఆర్.రామకృష్ణ సభకు అధ్యక్షత వహించగా, కార్యదర్శి జి.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

హాట్‌కేకుల్లా అమ్ముడైన వన్డే టికెట్లు

... 5వ పేజీ తరువాయి

కార్పొరేట్ బాక్స్ రూ.15,000, షూట్ రూ.18,000 ధర టికెట్లు అందుబాటులో ఉండగా, రాత్రి 9.00 గంటల సమయంలో రూ.18,000 టికెట్లు కూడా కనిపించలేదు. మిగిలిన కార్పొరేట్ బాక్స్ రూ.15,000 టికెట్లు మాత్రం రాత్రి 10.00 గంటలకు అందుబాటులో ఉన్నట్లు వెబ్‌సైట్‌లో చూపించింది. స్టేడియం సామర్థ్యం మేరకు 22 వేల టికెట్లు అమ్మకానికి పెడుతున్నట్టు ఏసీఏ ప్రతినిధులు ప్రకటించారు. అయితే ఏ ధర టికెట్లు ఎన్ని (డినామినేషన్) అనే వివరాలను వెల్లడించలేదు. రూ.1,200 టికెట్లు నిమిషాల వ్యవధిలోనే అయిపోవడంతో సగటు క్రీడాభిమానులు నిరుత్సాహానికి గురయ్యారు.

రైలులో ప్రయాణిస్తుండగా పురిటినొప్పులు

... 5వ పేజీ తరువాయి

సాధారణ ప్రసవాన్ని విజయవంతంగా చేయించగలిగారు. తల్లి, బిడ్డ ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉన్న నేపథ్యంలో వారిని తదుపరి చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అప్రమత్తంగా వ్యవహరించి సాధారణ ప్రసవం చేయడంతో పాటు తల్లీబిడ్డలను కాపాడేలా సేవలందించిన డాక్టర్ భాషిణి ప్రియాంక బృందాన్ని వాల్తేరు డీఆర్ఎం లలిత్ బొహ్రా అభినందించారు.

పంచాయతీల విభజన

... 5వ పేజీ తరువాయి

అవకాశాలున్నాయని చెబుతున్నారు. నగరానికి ఆనుకుని కొన్ని పంచాయతీలు ఆస్తి పన్ను రూపేణా ఏడాదికి రూ.కోటికి మించి ఆదాయం సమకూర్చుకుంటున్నాయి. నగర విస్తరణ, ఐటీ కంపెనీల రాక, తదితర పరిణామాలను దృష్టిలో పెట్టుకుని కొన్నిచోట్ల పంచాయతీల విభజనకు నేతలు పట్టుబడుతున్నారు. ప్రజా ప్రతినిధుల ద్వారా కొత్త పంచాయతీల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. కొత్త పంచాయతీల ఏర్పాటుచేసే సమయంలో సంబంధిత పంచాయతీ పరిధిలో గ్రామ సభ నిర్వహించి ప్రజల అభిప్రాయాలను తీసుకోవాల్సి ఉంటుంది. తాజాగా జీవో కూడా విడుదల కావడంతో జిల్లాలో కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులు నిర్ణయించారు.

ఐకానిక్ టవర్స్‌పై గందరగోళం

... 5వ పేజీ తరువాయి

(16వ తేదీ) ఆదివారం ఉదయం 7 గంటలకు పురపాలక శాఖా మంత్రి నారాయణ వీఎంఆర్‌డీఏలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో ఆయన కైలాసగిరిపై 50 అంతస్థుల ఐకానిక్ టవర్ నిర్మిస్తున్నామని, దీనికి అనుమతులు కూడా ఇచ్చామని చెప్పినట్టు సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై తొలుత జిల్లా అధికారుల ప్రకటన కూడా ఆ విధంగానే విడుదలైంది. ఆ తరువాత నాలుక కరుచుకొని 'కైలాసగిరి' అనే పదం తొలగించారు. అంతే తప్ప ఆ ప్రాజెక్టు వచ్చే ఏరియా ఏమిటో స్పష్టత ఇవ్వలేదు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టుపై జరుగుతున్న ప్రచారం గురించి వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ వద్ద ప్రస్తావించగా, దీనిపై త్వరలోనే ప్రకటన విడుదల చేస్తామన్నారు. ఎవరికీ ఈ ప్రాజెక్టును అప్పగించలేదని, మరోసారి ప్రకటన ఇచ్చే అవకాశం ఉందన్నారు.

ఉత్పత్తి పెంచకుంటే మనుగడ కష్టం

... 5వ పేజీ తరువాయి

కన్వేయర్ బెల్టులు మూడుసార్లు తెగిపోయాయి. దీనివల్ల ఉత్పత్తి తగ్గిపోయింది. ఉద్యోగులే కావాలని బెల్ట్‌ను కోసేస్తున్నారంటూ యాజమాన్యం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. దాంతో ఆయన శుక్రవారం ప్లాంటుకు వచ్చి అన్నీ పరిశీలించారు. అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓ మహిళా అధికారిణి మాట్లాడుతూ స్టీల్ ప్లాంటు ఉద్యోగులు ఇలాంటి తప్పుడు పనులు చేయరని, నిర్వహణ లేకే అవి తెగిపోతున్నాయని వివరించారు. యాజమాన్యం మాత్రం ఎన్నడూ లేనిది ఇప్పుడే ఎందుకు తెగుతున్నాయని వాదించింది. కాంట్రాక్టు కార్మికులను వేల సంఖ్యలో తగ్గించేసి, నిర్వహణకు నిధులు ఇవ్వడం ఆపేస్తే ఏ యంత్రాలైనా ఇలాగే అవుతాయని అధికార వర్గాలు వాదిస్తున్నాయి. ఈ సందర్భంగా జరిగిన చర్చలో అధికారుల సంఘం నాయకుడు ఒకరు బ్లాస్ట్ ఫర్నేస్‌ల సమస్యను ప్రస్తావించగా, ఇప్పుడు దానిపై చర్చ వద్దని, కేవలం కన్వేయర్ బెల్టులపైనే మాట్లాడాలంటూ సమావేశాన్ని ముగించి జాయింట్ సెక్రటరీలు వెళ్లిపోయారు. వారు వచ్చిన విషయం స్థానిక ఎంపీకి కూడా సమాచారం లేదని, యాజమాన్య ప్రతినిధులు ఉద్యోగులను దోషులుగా చిత్రీకరిస్తున్నారని, ఈ విధానం మానుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అవసరమైన ముడి పదార్థాలు ఇవ్వకుండా 92.5 శాతం యుటిలైజేషన్ ఏ విధంగా సాధ్యమవుతుందో యాజమాన్యమే చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

రైల్వే స్టేషన్‌కు మరో రూ.300 కోట్లు

... 5వ పేజీ తరువాయి

జరుగుతున్నాయని, అవి 2027 ఫిబ్రవరి నాటికి పూర్తవుతాయన్నారు. ఈలోగా జోన్ కార్యకలాపాల నిర్వహణకు డెక్‌లో ఆరు, ఏడు అంతస్థులు తీసుకున్నారని, ఆరో అంతస్థులో ఆఫీసు నిర్మాణ పనులు పూర్తయ్యాయని, ఏడో అంతస్థులో పనులు ప్రారంభించారన్నారు. జోన్ ఆపరేషన్‌కు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ త్వరలోనే వస్తుందని ఎంపీ ఆశాభావం వ్యక్తంచేశారు. వాల్తేరు డివిజన్‌ను రెండుగా విడగొట్టడం వల్ల కొన్ని సాంకేతిక సమస్యలు వచ్చాయని, వాటి వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా ఉండేలా ఎలా చేయాలా?...అనే దానిపై రైల్వే బోర్డు ఆలోచన చేస్తోందన్నారు. డెక్‌లో జోన్ కార్యాలయం ప్రారంభోత్సవానికి సీఎం చంద్రబాబునాయుడును ఆహ్వానిస్తామని, రైల్వే మంత్రి కూడా వర్చువల్‌గా పాల్గొంటారన్నారు. ఈ కార్యాలయంలో మొత్తం 250 మంది అధికారులు పనిచేస్తారని, వారిలో 100 మంది ఉన్నత స్థాయి అధికారులు, మరో 60 మంది జాయింట్ సెక్రటరీ స్థాయి అధికారులు ఉంటారని, ఇది చాలా కీలకంగా ఉంటుందని ఎంపీ వ్యాఖ్యానించారు.

14 ప్లాట్‌ఫారాలకు పెంపు

రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు మొదలయ్యాయని, పాత డిజైన్ ప్రకారం కాంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగించారని, అయితే ప్లాట్‌ఫారాల సంఖ్య 14కు పెంచాలని, స్టేషన్ ముఖద్వారం రూపురేఖలు కూడా మార్చాలని రైల్వే బోర్డు సూచించిందన్నారు. వాటికి సంబంధించిన ప్రతిపాదనలు పంపించారని, వాటికి ఆమోదం లభిస్తే ఇంకో రూ.300 కోట్లతో మరిన్ని పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈలోగా ప్రయాణికులకు అవసరమైన వసతులు, తదితరాల పనులన్నీ పూర్తిచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ తేజ్‌భరత్, సెక్రటరీ మురళీకృష్ణ, జాయింట్ కమిషనర్ రమేశ్, సీఈ వినయకుమార్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ఆ 4 రహదారులపై ఫోకస్

... 5వ పేజీ తరువాయి

పనుల్లో జాప్యం జరుగుతున్నట్టు గుర్తించాం. ఏదైనా రిజిస్ట్రేషన్ 48 గంటల్లో పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నాం. దీనికోసం వీఎంఆర్‌డీఏ భవనంలోనే రిజిస్ట్రేషన్ల శాఖ సిబ్బందితో ఒక డెస్క్ ఏర్పాటుచేసి, ఇక్కడే పనులు పూర్తిచేస్తాం.

ప్రాజెక్టు మానటరింగ్ యూనిట్

సుమారు పదిహేను వరకూ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటిని సకాలంలో పూర్తి చేయడానికి ప్రాజెక్టు మానటరింగ్ యూనిట్ (పీఎంయూ) ఒకటి ఏర్పాటు చేస్తాం. అదేవిధంగా అధునాతన సాంకేతిక అంశాలు అమలు చేయడానికి ఐటీ సెల్‌ను కూడా పెడుతున్నాం.

మాస్టర్ ప్లాన్‌పై కసరత్తు పూర్తి

మాస్టర్ ప్లాన్-2040లో మార్పులకు సంబంధించి అభ్యంతరాలు ఆహ్వానిస్తే 3,500 దరఖాస్తులు వచ్చాయి. వాటన్నింటినీ పూర్వ ఎంసీ విశ్వనాథన్ పరిశీలించి, నివేదిక తయారుచేశారు. దానిని డిసెంబరు 3న విజయవాడ ఉన్నతాధికారులకు సమర్పిస్తాం. ఆ తరువాత దానిని పబ్లిక్ డొమైన్‌లో పెట్టి, మళ్లీ అభ్యంతరాలు తీసుకొని ఫైనల్ మాస్టర్ ప్లాన్ ఖరారు చేస్తాం.

టూర్ ప్యాకేజీలు

వీఎంఆర్‌డీఏకు ఆదాయం పెంచడానికి, పర్యాటక స్థలాలకు డిమాండ్ తీసుకురావడానికి స్వయంగా సంస్థ ద్వారా టూర్ ప్యాకేజీలు ఏర్పాటుచేస్తాం. విద్యార్థులకు వీఎంఆర్‌డీఏకు చెందిన అన్ని మ్యూజియాలు (కురుసుర, టీయూ-142, సీ హ్యారియర్, యుహెచ్-3హెచ్, తెలుగు మ్యూజియం) చూపించి చిల్డ్రన్ ఎరీనాకు తీసుకువచ్చి మధ్యాహ్న భోజనం పెట్టి, అక్కడే కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఇలా నెలలో 15 రోజులు చిల్డ్రన్ ఎరీనాను పిల్లల కార్యక్రమాలతో ఎంగేజ్ చేస్తాం. ఆదాయం పెరుగుతుంది. పిల్లలకు అవగాహన కలుగుతుంది. ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల్లో కొంత సిబ్బంది కొరత ఉంది. సచివాలయాల సిబ్బందిని తీసుకొని పని చేయించుకోవాలని యోచిస్తున్నాం. శనివారం జరిగే వీఎంఆర్‌డీఏ బోర్డు సమావేశంలో మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటాం.

దుర్గమాంబకు పూజలు

అగనంపూడి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అమ్మవారిని నూతన వస్త్రాలతో అలంకరించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. లలితా పారాయణం, విష్ణుసహస్ర నామ పారాయణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం శివారు జనతాకాలనీ 11కేవీ ఉప కేంద్రం పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగుతుందని ఈఈ బీకే నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా సెయింట్ ఆన్స్ జోన్ కళాశాల ఏరియా, ఇండస్ట్రియల్ కాలనీ, రామకృష్ణపురం, వెంకన్నపాలెం, ప్రియదర్శిని కాలనీ, జనతాకాలనీ తదితర ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

వేపగుంట పరిసర ప్రాంతాల్లో..

వేపగుంట: చెట్ల కొమ్మలు తొలగింపు, విద్యుత్తు నిర్వాహణ పనుల్లో భాగంగా 33/11 కేవీ వెంకటాపురం ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుదని ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటాపురం, ఆర్ఆర్. వెంకటాపురం, ఎస్‌సీబీసీ.కాలనీ, అజంతా పార్క్ పరిసర ప్రాంతాల ప్రజలు సహకరిం చాలని కోరారు.

అన్న సమారాధన

వేపగుంట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 93వ వార్డు ఆర్ఆర్.వీపుంర పవర్ ఆఫీస్ పీఠం ఆధ్వర్యంలో శుక్రవారం దాదాపు 1000 మంది అయ్యప్ప భక్తులకు అన్నసమారాధన చేశారు. అంతకముందు అయ్యప్ప భక్తులు ఇరుముడులు కట్టుకున్నారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేపగుంటలో రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న దృశ్యం

వేపగుంట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 94వ వార్డు శ్రీముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప సేవాపీఠం ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం చేయడం వల్ల తోటి వ్యక్తికి ప్రాణదానం చేసినట్టేనన్నారు. రోటరీ క్లబ్ సహకారంతో చేపట్టిన ఈక్యాంపులో 147 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం),
- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలని** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ),
- **కాంత** :
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **ది గర్ల ఫ్రండ్** :శ్రీకన్య, కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 48, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 70, బెండకాయలు 52, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 48, బీరకాయలు 44, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 22, క్యారెట్ 54, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 70, బరబాటి 46, ముల్లంగి 30ఖరి, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 56, దోస కాయలు 30, వె ల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 46, కీరదోస 26, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 26, చిలగడదుంపలు 36, కంద 50, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 54, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 180, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 70, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 50

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

- జ్యోతిరావు పూలే వర్ధంతి సభలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల సంక్షేమంతో మహిళా విద్యాభివృద్ధికి శ్రమించిన మహాత్మా జ్యోతిరావుపూలే ఆశయా సాధనకు అందరూ కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టాడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, తదితర నాయకులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెంలో..

కూర్మన్నపాలెం: మహాత్మా జ్యోతీరావు పూలే ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు పప్పు రాజారావు అన్నారు. కూర్మన్నపాలెం జంక్షన్‌లో శుక్రవారం నిర్వహించిన జ్యోతీరావ్ పూలే 135 వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బడుగులు బానిసలుగా మారడానికి, సమాజంలో వివక్షలను అర్థం చేసుకోలేక పోవడానికి చదువు లేకపోవడమే ప్రధాన కారణమని పూలే గ్రహించారని అన్నారు. మహిళల సంక్షేమానికి, వయోజన విద్యా విధానానికి అనేక రూపకల్పనలు తీసుకువచ్చారని అన్నారు. కుల వ్యవస్థలో బానినత్వానికి వ్యతిరేకంగా పోరాడడమే ప్రధాన కర్తవ్యంగా పూలే భావించారని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా అనేక పోరాటాలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఏపీ బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో..

ఏపీ బహుజన సమాజ్ పార్టీ, ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతీరావుపూలే 135 వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు, మహిళా సాధికారతకు కృషి చేసిన మహాత్ముడు పూలే అని అన్నారు.

పగలే వెలుగులు



పగలే వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు

అగనంపూడి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డులోని దిబ్బపాలెం, పెదమడక, దానబోయిన పాలెం ప్రాంతాల్లో వీధి లైట్లు పగలే వెలుగులు విరజిమ్ముతున్నాయి. వీటి నిర్వహణ పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు అవస్థలు పడుతుంటే ఇక్కడ మాత్రం పగలు, రాత్రి అని తేడా లేకుండా నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. వీధి దీపాల నిర్వహణపై స్థానికులు మండిపడుతున్నారు. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి ఉంది. దీనిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నాతిధికారులు చొరవ తీసుకుని వీధి దీపాల నిర్వహణ సక్రమంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉచిత నేత్ర వైద్య పరీక్షలు



నేత్ర పరీక్షలకు వెళ్లిన సభ్యులు

మల్కాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోరమాండల్ ఎరువుల కర్మాగారం సామాజిక సేవా కార్యక్రమాలను రోజురోజుకు విస్తృతం చేస్తోందని కంపెనీ అధికారులు పేర్కొన్నారు. ములగాడ గ్రామంలో ఇటీవల నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో కంటి ఆపరేషన్లు చేయించాలని గుర్తించిన వారిని శుక్రవారం వాసన్ కంటి ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. దాదాపు 21 మందికి శస్త్ర చికిత్స చేయించనట్టు తెలిపారు. భవిష్యత్తులో వైద్య సేవలను మరింత విస్తృతం చేయనున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ ఎరువుల కర్మాగారం ప్రతినిధులు పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు నిర్మాణం



75వ వార్డులో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు

పెదగంట్యాడ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 75వ వార్డులో పలుచోట్ల రూ.60 లక్షల వ్యయంతో వీధి రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కండిపల్లి వీధి, గొందేశి వీధి, దుర్గమాంబ ఆలయం వీధుల్లో ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, కార్పొరేటర్ పర్యవేక్షిస్తున్నారు. సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతలో ఎక్కడా రాజీ పడొద్దని పర్యవేక్షిస్తున్న ఇంజనీర్, కార్పొరేటర్ సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచిస్తున్నారు. పది రోజుల్లో ఈ పనులను పూర్తి చేయాలని కోరారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తు వైసీపీ 68 వార్డు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అక్కిరెడ్డి పాలెంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కార్పొరేటర్ గుడివాడ అనూష ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ లతీశ్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

దుమ్ము, ధూళితో నిండిన రోడ్డు



మట్టితో నిండిపోయిన డాక్‌యార్డు కాలనీకి వెళ్లే రహదారి

పెందుర్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గిరిప్రసాద్ నగర్ నుంచి టీచర్స్ కాలనీ రహదారిలో ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. మట్టితో దుమ్ము కొట్టుకుపోయి రాళ్లు తేలి అధ్వారంగా ఉన్న మారిన ఈ రోడ్డు అధికారులకు కనిపించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. మాస్టర్ ప్లాన్‌లో 80 అడుగుల రోడ్డు విస్తరణ పనులు చేపట్టకపోవడంతో రహదారి ఆక్రమణకు గురవుతోందని పలువురు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాన పడితే రహదారి బురదమయంగా మారి అడుగు వేయలేని పరిస్థితి. సుజాతనగర్, గిరిప్రసాద్‌నగర్, టీచర్స్‌లేఅవుట్, డాక్‌యార్డు కాలనీలకు వెళ్లే వారికి ఇదే ప్రధాన రహదారి. రోజుకు వందల మంది ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డు విస్తరణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

వచ్చే నెల 23, 24 తేదీల్లో పీసా మహోత్సవ్

- 10 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు, కళాకారులు హాజరు
- కేంద్ర పంచాయతీరాజ్ సంయుక్త కార్యదర్శి ముక్తా శేఖర్



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కేంద్ర పంచాయతీరాజ్ సంయుక్త కార్యదర్శి ముక్తా శేఖర్. చిత్రంలో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఉన్నారు

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పీసా (పంచాయతీస్ ఎక్స్‌టెన్షన్ టూ షెడ్యూల్డ్ ఏరియాస్)-1996 చట్టం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చేనెల 23, 24 తేదీల్లో విశాఖ వేదికగా వేడుకలు (పీసా మహోత్సవ్) నిర్వహిస్తున్నట్టు కేంద్ర పంచాయతీరాజ్ సంయుక్త కార్యదర్శి ముక్తా శేఖర్ వెల్లడించారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఎం.కృష్ణతేజతో కలిసి ఆమె శుక్రవారం హోటల్ గ్రాండ్‌బేలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రెండు రోజులపాటు జరగనున్న మహోత్సవ్‌లో పది రాష్ట్రాల నుంచి క్రీడాకారులు, కళాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఖేల్ ఇండియా ఆధ్వర్యంలో కబడ్డీ, ఇంకా ఇతర క్రీడా పోటీలు ఉంటాయన్నారు. నగరంలోని పోర్టు స్టేడియంలో ఈ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ మాట్లాడుతూ ఈ ఉత్సవ్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాల్గొంటారని తెలిపారు. మహోత్సవంలో భాగంగా 23వ తేదీ ఉదయం ఆర్కే. బీచ్‌రోడ్డులో పది కిలోమీటర్ల మారథాన్ నిర్వహించనున్నామని వెల్లడించారు. డిసెంబరు 22వ తేదీ నుంచే క్రీడా పోటీలు కొనసాగుతాయని, 24న గ్రామ స్వరాజ్ పేరుతో వర్క్‌షాపులు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతోపాటు పుస్తకావిష్కరణ ఉంటుందన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని అధికారులు ఏర్పాట్లుచేయాలని సూచించారు. మహోత్సవ్ బ్రాండింగ్‌కు సంబంధించి చర్యలు తీసుకోవాలన్నారు. మారథాన్‌లో పాల్గొనే క్రీడాకారులకు అందించే టీషర్టుల రూపకల్పన, ఇంకా ప్రచారం కోసం హోర్డింగ్‌లు, ఎలక్ట్రానిక్ బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి ఎంఎస్వీ శ్రీనివాసరావు, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి జాన్ గాలియట్, అధికారులు పాల్గొన్నారు.

నగరాలే కాదు పల్లెలూ అభివృద్ధి చెందాలి

- జీఎస్టీ ఆడిట్ రాష్ట్ర కమిషనర్ ఆనంద్‌కుమార్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆనంద్‌కుమార్

పెందుర్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి అనేది నగరాలకే కాదు పల్లెలకు కూడా చేరాలని జీఎస్టీ ఆడిట్ రాష్ట్ర కమిషనర్ ఆనంద్‌కుమార్ పులపాక అన్నారు. ఏకలవ్యకాలనీలనీలో రూ.2.50 కోట్ల నిధులతో నిర్మించిన ఆరు మరుగుదొడ్లు, బోర్‌వెల్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కాలనీలో శానిటేషన్, తాగునీటి విభాగం, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం ఆ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కృనాల్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ అరవిందదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పెందుర్తిలో అక్రమ నిర్మాణాల జోరు



పెందుర్తి కళాశాల సమీపంలో అక్రమ నిర్మాణం

పెందుర్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎనిమిదో జోన్‌లోని చినముషిడివాడ, సుజాతనగర్, పురుషోత్తపురం, వేపగుంట, పెందుర్తి కళాశాల ప్రాంతాల్లో పట్టణ ప్రణాళిక విభాగం నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. కొంత మంది అక్రమదారులతో పట్టణ ప్లానింగ్ అధికారులు చేతులు కలిపి అక్రమాలను కూడా సక్రమం చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం. దీని కోసం ప్రత్యేకంగా ఫిక్స్‌డ్‌గా మార్జిన్ పెట్టి మరీ పైసా వసూలు చేస్తున్నారని తెలిసింది. కొందరితో జోన్ 8లోని ఎల్‌టీపీ (లైసెన్స్‌డ్ టెక్నికల్‌పర్సన్) చేతులు కలిపి ఈ అక్రమాలకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో పెందుర్తి కళాశాల సమీపంలో అక్రమ నిర్మాణం చేపట్టారని, నిర్మాణ సామగ్రి వల్ల సమీపంలో ఇంటిపై పడుతు ఇబ్బందులు వస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం భద్రతా చర్యలు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. దీనిపై పట్టణ ప్రణాళిక అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం స్పందన లేదని మరో ఇంటి యజమాని అంటున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నదని స్థానికుల అభిప్రాయం.

ప్రధాన రహదారిపై మురుగు



దువ్వాడ రైల్వేస్టేషన్ రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

కూర్మన్నపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్ నుంచి సబ్బవరం వెళ్లే ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రవాహం వల్ల స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోట్ల రూపాయిలు వెచ్చించి నిర్మించిన రహదారులు నాశనమవుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. రెండు నెలలుగా ఈ రహదారిమీదుగా ప్రజాప్రతినిధులు, ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది తిరుగుతున్నా ఒక్కరూ కూడా పట్టించుకోకపోవడంపై పలువురు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు ప్రవాహం వల్ల అంటురోగాలు ప్రబలే అవకాశముందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారులు, కార్పొరేటర్‌కు దృష్టికి తీసుకెళ్లి వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని, మురుగునీరు పోయేందుకు డ్రైనేజీలు నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

'రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించండి'

కూర్మన్నపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కణితి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నంద్యాల, అన్నమయ్య జిల్లాల్లో శని, ఆదివారాలు జరగనున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి బాలుర, బాలికల బేస్‌బాల్ టోర్నమెంట్‌కు వెళుతున్న సందర్భంగా హెచ్‌ఎం నరసింగరావు వారిని శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సి పాల్ నరసింగరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి క్రీడ ల్లో విజేతలుగా నిలిచి తల్లిదండ్రులకు, పాఠశాలకు, అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అండర్- 17 పోటీలకు వి.మాధవి, డి.సు జాత, జి.వర్షిణి ఎంపికైయారు. అలాగే అండర్-14 పోటీలకు ఎస్.వినయ్, జి.షర్మిళ, ఎస్.చాందిని, ఎస్.ఫణీంద్ర, తదితరులు ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 68 వార్డులోని రామ్‌నగర్, అక్కిరెడ్డిపాలెం, అప్పన్నకాలనీల్లో రూ.5.45 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రధాన డ్రైనేజీలు, రహదారుల నిర్మాణ పనులకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5.45 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రధాన డ్రైనేజీ నిర్మాణం వల్ల వార్డ ప్రజలు ఎదుర్కొంటున్న జల కాలుష్య సమస్య పరిష్కారమవుతుందన్నారు. రామ్‌నగర్‌లో ఎన్నో ఏళ్లగా నిర్వహిస్తున్న ఆదివారం సంత స్థలంలో రైతు బజార్ ఏర్పాటు చేయడంతో పాటు, సామాజిక భవన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గుడివాడ అనూష, టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

మింది చెరువు పనులు పరిశీలన

భూగర్భ జలాల పెంపునకు ఎంతో ఉపయోగపడే చెరువుల రక్షణకు అందరూ కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. 68 వార్డులోని మింది చెరువు ఆధునీకరణ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గుడివాడ అనూష మాట్లాడుతు చెరువును అభివృద్ధి చేయడంతో పాటు చుట్టు వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, బాక్స్ క్రికెట్ వంటివి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలి

- డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్



భవితా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో డీఈవో ప్రేమ్‌కుమార్

కూర్మన్నపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భవితా చిన్నారులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ అన్నారు. 87వ వార్డు వడ్లపూడిలోని ఉన్న భవితా కేంద్రంలో దివ్యాంగుల చిన్నారులకు శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు ఉపకరణాల పంపిణీ కోసం గుర్తింపు, వైకల్య నిర్ధారణ, వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. ఎంఈవో సునీత, సమగ్ర శిక్ష అడిషినల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ జె.చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ దివ్యాంగులకు వైద్య పరీక్షల అనంతరం గాజువాక, పెద గంట్యాడ, ములగాడ విద్యార్థులకు ఉపకరణాలు అందజేస్తామన్నారు. శిబిరంలో 300 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, జిల్లా సహిత విద్య సమన్వయ కర్త ఉప్పలపాటి నీరజ, త్రినాథరావు, రమణాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గ్రామ సందర్శన'లో జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు



'గ్రామ సందర్శన'లో భాగంగా తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

గోపాలపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల కృషి కూడా ఎంతో ఉండాలని స్థానిక జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వేణుగోపాల్ అన్నారు. గోపాలపట్నం జడ్పీ హైస్కూల్ బాలురోన్నత పాఠశాల అధ్యాపకులు 'గ్రామ సందర్శన' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలంటే విద్యార్థుల్ని క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని, పిల్లలపై వ్యక్తిగత శ్రద్ధ చూపించాలని తల్లిదండ్రులకు సూచించారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో పాఠశాలల్లో 100 రోజుల యాక్షన్ ప్లాన్ నిర్వహిస్తున్నామని, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ఉత్తమ ఫలితాలు సాధించడానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం, ఆహ్లాదం : బొండా జగన్

కూర్మన్నపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఆరోగ్యం, ఆహ్లాదం సొంతమవుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87 వార్డు తిరుమల నగర్‌లో శుక్రవారం నిర్వహించిన షటిల్ బాడ్మింటన్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత క్రీడల పట్ల మక్కువ చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.





సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

ఎంవీపీ కాలనీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు డిసెంబరు 3 వరకూ పొడిగించినట్టు సర్దార్ గౌతులచ్చన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష కూడా డిసెంబరు 12కు వాయిదా వేసినట్టు పేర్కొన్నారు జిల్లాకు చెందిన వారై, ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రెండు ఫొటోలు, విద్య, కుల, ఆదాయ ధ్రువీకరణ, ఆధార్, పాన్ తదితర జెరాక్స్ కాపీలతో నేరుగా ఎంవీపీ కాలనీలోని ఆరో సెక్టార్‌లోని కార్యాలయంలో అందించాలన్నారు. ఎంపికైన వారికి విజయవాడ గొల్లపూడిలోని బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ, భోజనం, వసతి సౌకర్యం ఉంటుందన్నారు. వివరాలకు 94925 69177 నంబరులో సంప్రదించాలన్నారు.

మాధవధార తోటల్లో అగ్ని ప్రమాదం


మంటల్ని ఆర్పుతున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది

మాధవధార, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానానికి చెందిన మాధవధార తోటల్లోని చెట్లకు శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. వుడాకాలనీ నుంచి భక్తులు కొండపై జలధారకు వెళ్లే గిరిప్రదక్షిణ దారిలో ఉన్న చెట్లు, ఎండిన చెట్ల వ్యర్థాలు మంటల్లో కాలిబూడిదయ్యాయి. ఈ దారిలో ఉన్న నివాస సముదాయాల ఎదుటే దట్టమైన పొగ, పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో అక్కడకు అదే సమయంలో విధులకు హాజరైన మాధవధార 289వ సచివాలయ వీఆర్వో రవి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సమయానికి చేరుకుని మంటలను ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. జలధారల వద్ద ఇటీవల అల్లరి మూకలు చేరుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయనిస్థానికులు తెలిపారు. ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీస్ సిబ్బంది గస్తీ పెంచి ఆకతాయిల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

రైల్వే జోన్ కార్యాలయం రెడీ

దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం పనులు సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ డెక్‌లో జోరుగా సాగుతున్నాయి. వీటిని శుక్రవారం ఎంపీ శ్రీభరత్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ పరిశీలించారు. ముడసర్లోవలో శాశ్వత భవన నిర్మాణాలు పూర్తయ్యేందుకు మరో ఏడాది సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో జోన్ కార్యకలాపాలకు డెక్‌లో రెండు అంతస్థులు తీసుకున్నారు. ఆరో అంతస్థులో ఆఫీసు నిర్మాణ పనులు పూర్తవగా, ఏడో అంతస్థులో పనులు ప్రారంభించారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


కార్యాలయంలో సిద్ధమైన అధికారుల చాంబర్లు



సౌత్ సెంట్రల్ రైల్వే కార్యాలయం


సిద్ధమైన మీటింగ్ హాల్

ప్రత్యేక రైళ్ల గడువు పొడిగింపు

విశాఖపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాలకు నడుస్తున్న ప్రత్యేక రైళ్లను జనవరి 2 వరకు పొడిగిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. విశాఖ-తిరుపతి- విశాఖ ప్రత్యేక రైలు డిసెంబరు 1 నుంచి 29 (ప్రతి సోమవారం) వరకు, తిరుగు ప్రయాణంలో డిసెంబరు 2 నుంచి 30 (ప్రతి మంగళవారం), విశాఖ-తిరుపతి-విశాఖ రైలు డిసెంబరు 3 నుంచి 31 వరకు (ప్రతి బుధవారం), తిరుగు ప్రయాణంలో డిసెంబరు 4 నుంచి జనవరి 1 వరకు (ప్రతి గురువారం), విశాఖ-చర్లపల్లి డిసెంబరు 5 నుంచి 26 వరకు (ప్రతి శుక్రవారం), తిరుగు ప్రయాణంలో డిసెంబరు 6 నుంచి 27 వరకు (ప్రతి శనివారం), విశాఖ-బెంగళూరు-విశాఖ డిసెంబరు 7 నుంచి 28 వరకు (ప్రతి ఆదివారం), తిరుగు ప్రయాణంలో డిసెంబరు 8 నుంచి 29 వరకు (ప్రతి సోమవారం), సంబల్‌పూర్-ఇరోడ్-సంబల్‌పూర్ వయా దువ్వాడ డిసెంబరు 3 నుంచి 31 వరకు, తిరుగు ప్రయాణంలో డిసెంబరు 5 నుంచి జనవరి 2 వరకు, భువనేశ్వర్-యశ్వంత్‌పూర్-భువనేశ్వర్ వయా దువ్వాడ డిసెంబరు 6 నుంచి 27 వరకు, తిరుగు ప్రయాణంలో డిసెంబరు 8 నుంచి 28 వరకు, షాలిమార్-చెన్నై సెంట్రల్-షాలిమార్ వయా దువ్వాడ డిసెంబరు 1 నుంచి 29 వరకు, తిరుగు ప్రయాణంలో డిసెంబరు 3 నుంచి 31 వరకు, చర్లపల్లి-షాలిమార్-చర్లపల్లి వయా దువ్వాడ రైలు డిసెంబరు 1 నుంచి 30 వరకు, తిరుగు ప్రయాణంలో డిసెంబరు 2 నుంచి 31 వరకు అందుబాటులో ఉంటాయి.


అవుట్ ఫీల్డ్‌పై పచ్చికను తొలగిస్తున్న దృశ్యం



స్టేడియం లోపల మెరుగులు దిద్దుతున్న కార్మికులు

ముస్తాబవుతున్న స్టేడియం

మధురవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారత్-దక్షిణాఫ్రికా మధ్య వచ్చేనెల 6న పోతినమల్లయ్యపాలెం ఏసీఏవీడీసీఏ క్రికెట్ స్టేడియంలో జరగనున్న అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఔట్‌ఫీల్డుపై పచ్చికను యంత్రాల సాయంతో తొలగిస్తున్నారు. వాతావరణానికి అనుకూలంగా తేమ లేకుండా గ్రౌండ్ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. స్టేడియం ఫస్ట్‌ఫ్లోర్‌లో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ఏసీఏ నేమ్ బోర్డుకు మెరుగులుదిద్దుతున్నారు. వాహనాల పార్కింగ్‌కు వీలుగా స్థలాలను చదును చేస్తున్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అసెట్ రికవరీ బ్రాంచ్, డోర్ నెం.26-15-150,
ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, చెంగలరావుపేట, విశాఖపట్నం-530001, ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 0891-2537792/2537782,
మొబైల్ నెంబర్: 9324517291, ఇ-మెయిల్ : ubin0817295@unionbankofindia.bank

డిమాండ్ నోటీసు సర్ఫేసీ చట్టము, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద జారీచేయబడినది

టు :
ఋణగ్రహీత : శ్రీ అద్దాల శ్రీనివాసరావు, తండ్రి : సూర్య ప్రకాశరావు, క్వా నెం.J4, R & B క్వార్టర్స్, సీతమ్మధార, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530 016.
హామీదారు : శ్రీ యాలంగి సత్య ప్రసాద్, తండ్రి : కృష్ణ మూర్తి, హెచ్ నెం.64-14-7/3, ప్రతాప్ నగర్, కాకినాడ, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్-533 001.
డియర్ సర్ / మేడమ్

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం 2002, సెక్షన్ 13 (3)తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద నోటీసు జారీచేయబడినది.

పైన తెలిపిన చిరునామాదారు నెం. 1 అయిన మీరు మా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రామారావుపేట బ్రాంచ్ లో దిగువ తెలిపిన ఋణసౌకర్యాలను పొందినారు మరియు చెల్లించవలసిన బకాయి/వడ్డీ/వాయిదా మొత్తములు తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఆదాయ గుర్తింపు మరియు ప్రుడెన్షియల్ అకౌంటింగ్ నిబంధనలకు సంబంధించి ఆర్‌బిఐ మార్గదర్శకాల ప్రకారం మీ ఋణఖాతాను తేది 31.03.2021న నిరర్థక ఆస్తి (NPA) ఖాతాగా వర్గీకరించబడినది. మీ నుండి క్రింద చూపిన విధముగా ఖాతా/లు నందు తేది 30.09.2025 నాటికి రూ.48,71,696.00 (అక్షరాల నలభై ఎనిమిది లక్షల డెబ్బై ఒక్క వేల ఆరు వందల తొంభై ఆరు రూపాయలు మాత్రమే) మా బ్యాంక్‌కు బకాయి పడి ఉన్నది. వివరములు దిగువున తెలుపబడినవి:

లోన్ / ఋణం స్వభావం	లిమిట్ (రూ॥)	వడ్డీ రేటు (% p.a.)	మొత్తం బకాయి(రూ॥)
టెర్మ్ లోన్ : 046930100077018	రూ.29,00,000.00	10.85%	రూ.48,71,696.00
మొత్తం	రూ.29,00,000.00		రూ.48,71,696.00

బకాయి పడిన సొమ్ములు లేదా బ్యాంకుకు చెల్లించాల్సిన సొమ్మును తిరిగి చెల్లించేందుకు శ్రీ అద్దాల శ్రీనివాస రావు ఈ క్రింది షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా పత్రాలను అమలు చేశారు మరియు దీని ద్వారా భద్రతా ఆసక్తిని కల్పించారు.

తనఖా పెట్టిన ఆస్తి వివరములు
శ్రీ అద్దాల శ్రీనివాస రావు, తండ్రి : సూర్య ప్రకాశ రావు గారికి చెందిన ఆస్తి
షెడ్యూల్-ఎ : కాకినాడ, ఫ్రేజర్ పేట, పిండిప్రోలు వారి వీధి, శ్రీ వెంకటేశ్వర నివాస్, పాత MC నెం.3-12/297, బ్లాక్ నెం.23, కొత్త వార్డు నెం.4, డి నెం.23-6-16 వద్ద విస్తీర్ణం 172.33 చ॥గ॥లలోని అవిభాజ్యమైన, నిర్దిష్టపరచని వాటా 57.44 చ॥గ॥లు లేదా 48.02 చ॥మీ॥లలోని మొత్తం భూమి. మొత్తం ఏరియా 172.33 చ॥గ॥లకు హద్దులు : ఉత్తరం : 22.00 అ॥లు లేదా 6.71 మీ॥లు : రోడ్డు, [illegible]

[illegible]

తేది: 18.10.2025, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

జూ పార్కుకు కొత్త జంతువులు


జూకు చేరిన హిమాలయన్ నల్ల ఎలుగుబంటి, తెల్ల నెమలి


స్పాటెడ్ డోవ్ (చుక్కల పావురం)

» జంతుమార్పిడి విధానంలో రాంచీ నుంచి తెచ్చిన అధికారులు

ఆరిలోవ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు నాలుగు రకాల కొత్త జంతువులు వచ్చాయి. జార్ఖండ్‌లోని రాంచీ భగవాన్ బిర్సా జులాజికల్ పార్కు నుంచి జంతుమార్పిడి విధానంలో శుక్రవారం వాటిని తీసుకువచ్చామని జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు.హిమాలయన్ బ్లాక్ బేర్‌లు (నల్ల ఎలుగుబంట్లు) రెండు మగ-1 ఆడ-1, మంచి నీటి మొసళ్లు 5 (రెండు మగవి, మూడు ఆడవి), స్పాటెడ్‌డవ్‌లు 10 (5 మగ, 5 ఆడ) సిల్వర్ పిజెంట్ (తెల్ల నెమళ్లు- ఒక మగ, ఒక ఆడ) మొత్తం 19 జంతువులు వచ్చాయి. ఇక్కడి నుంచి ఏడు జంతువులను పంపినట్టు చెప్పారు. ఇందులో రెండు వైల్డ్ డాగ్స్ (అడవి రేసు కుక్కలు - ఆడ, మగ), రెండు బార్న్ ఔల్ (గుడ్లగూబలు -ఒకటి ఆడ, ఒకటి మగ), బెంగాలీ మానిటర్ లిజార్డ్ (ఆడది) 1, బ్లాక్ స్వాన్ (నల్ల హంసలు 2 - ఒకటి మగ, ఒకటి ఆడ), వైల్డ్ బోర్ (అడవి గొర్రె) 2, గ్రే పెలికాన్-2, అలగ్జాండ్రైన్ పారా కిట్ (పెద్ద చిలుకలు) 8 పంపినట్టు తెలిపారు. మొత్తం 21 జంతువులున్నాయన్నారు. స్పాటెడ్ డవ్, ఘరియల్ సిల్వర్ జీజెంట్‌లకు జంటలు తీసుకురావడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆమె వివరించారు. ఇక్కడకు తీసుకొచ్చిన జంతువులను ప్రొటోకాల్ ప్రకారం క్వారంటైన్‌లో ఉంచిన అనంతరం సందర్శకులు తిలకించేందుకు ఎన్‌క్లోజర్‌లలో పెడతామని ఆమె చెప్పారు. ప్రస్తుతం వీటి ఆరోగ్యం బాగున్నదని, పశు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నాయని క్యూరేటర్ మంగమ్మ తెలిపారు.

ప్రసాద్ పనుల్లో నాణ్యత పాటించాలి


దేవస్థానంలో పనుల వివరాలు తెలుసుకుంటున్న దృశ్యం

సింహాచలం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం కింద చేపట్టిన పనుల్లో నాణ్యత పాటించాల్సిందేనని పర్యాటకశాఖ సీఈ వెంకటరమణ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం సింహగిరికి చేరుకున్న ఆయన స్వామిని దర్శించుకుని అనంతరం ప్రసాద్ పథకం పనులను పరిశీలించారు. మల్టీపర్పస్‌బిల్డింగ్, థియేటర్, క్యూ కాంప్లెక్స్, పరిశీలించారు. నమూనాలు సేకరించి నాణ్యతనిర్ధారించుకోవాలన్నారు. మురుగునీటి వ్యవస్థ ప్రణాళికాబద్ధంగా ఉండాలని, నీరు నిల్వ ఉండకుండా నిర్మాణాలు చేపట్టాన్నారు. ఆయన వెంట పర్యాటక శాఖ ఏఈ సీతారామారావు, దేవస్థానం డీఈఈ రామరాజు, ఏఈ రవిరాజు, రవికుమార్, తదితరులున్నారు.

3 నుంచి ఆలిండియా రైల్వే వెయిట్ లిఫ్టింగ్ టోర్నీ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తా రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్, వాల్తేరు డివిజన్ నిర్వహించనున్న అఖిల భారత పురుషుల, మహిళల రైల్వే వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ టోర్నీ డిసెంబరు 3న ప్రారంభం కానుంది. రైల్వే ఇండోర్ స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్ వేదికగా నాలుగు రోజులు జరగనున్న ఈ టోర్నీ ప్రచార పోస్టర్‌ను డీఆర్ఎం లలిత్ బొహ్రా శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ టోర్నీలో వివిధ జోన్‌ల నుంచి పాల్గొంటున్న లిఫ్టర్లకు ఎటువంటి లోపాలు తలెత్తకుండా పోటీలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఇ.శాంతారామ్, స్పోర్ట్స్ ఆఫీసర్ ఎం.హరినాథ్, సంయుక్త స్పోర్ట్స్ ఆఫీసర్ సుమిత్ వర్మ, ప్రధాన కార్యదర్శి ఎస్.ఉష, రైల్వే వెయిట్ లిఫ్టింగ్ కార్యదర్శి సురేష్, ఇన్‌చార్జి జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు: విజయవాడ, డోర్ నెం.59-12-6, గ్రేస్ లైన్, ఘంటసాలవారి వీధి, గాయత్రీనగర్, విజయవాడ, కృష్ణా జిల్లా-520008
సర్ఫేసీ చట్టం 2002 ప్రకారం ఇ-వేలం అమ్మకం ప్రకటన (FORMAT X)
సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002
[illegible]

రిజర్వ్ ధర: రూ. 20,40,000/- ధరావతు సొమ్ము: రూ. 2,04,000/-
[illegible]
ఇ-వేలం తేదీ మరియు సమయం: తేదీ 24-12-2025 ఉ॥ 11.00 గం. నుండి మ॥ 1.00 గం.ల వరకు
ఇ-వేలం జరుపు వెబ్‌సైట్: https://sarfaesi.auctiontiger.net
బిడ్డు సమర్పించుటకు ఆఖరి తేదీ: తేదీ 23-12-2025, సాయంత్రం 5 గం.ల వరకు
బిడ్ పెంపుదల సొమ్ము: రూ. 10,000/-
[illegible]
తేదీ: 27.11.2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్

మత్స్యకారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

» జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు


మత్స్యశాఖ ప్రతినిధులు, అధికారులతో లక్ష్మణరావు

బీచ్ రోడ్డు, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): సముద్రంలో వేట సాగిస్తున్న మత్స్యకారులు నిబంధనలు పాటించాలని మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు సూచించారు. మత్స్య దిగుబడుల్లో హార్బర్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్రం కొత్తగా తెచ్చిన నిబంధనల ప్రకారం విశిష్ట ఆర్థిక మండలి (ఈఈజెడ్) పరిధిలో చేపల వేట సాగించే మోటారు, మర పడవలకు యాక్సెస్‌పాస్ పొందాలన్నారు. రియల్ క్రాఫ్ట్ వెబ్‌సైట్‌లో లైసెన్స్ సిబ్బంది వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. దేశీయ ప్రాదేశిక జలాల్లో మాత్రమే వేట సాగించాలన్నారు. మత్స్యకారుల జీవన ప్రమాణాల మెరుగుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. చేపల వనరులను గుర్తించడానికి, సముద్రంలో భద్రతా సూచనలను అందించడానికి ప్రభుత్వం శాటిలైట్ సాంకేతికతను ఉపయోగించడాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. మర పడవలను మెరుగుపరచడానికి కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆశాజ్యోతి, గురునాథరావు, కె.భూశంకర్, సైదానాయక్, గోపి, పాల్గొన్నారు.

క్రైం... crime news

యువకుడి ఆత్మహత్య


వంశీ మృతదేహం

మల్కాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చేసేందుకు పని లభించకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శ్రీహరిపురంలో జరిగింది. శ్రీహరిపురానికి చెందిన బొడ్డేట వంశీ (27) రెండేళ్లు మలేషియాలో పని చేసి తిరిగి వచ్చాడు. ఇక్కడ తగిన పని లభించకపోవడంతో అవమానంగా భావించి మనస్తాపం చెందాడు. దీంతో గురువారం రాత్రి తన గదిలోకి వెళ్లి ఫ్యాన్ హుక్కుకు ఉరివేసుకున్నాడు. ఉదయం ఎంతకీ వంశీ బయటకు రాకపోవడంతో తల్లి బలవంతంగా తలుపులు తీసి చూసింది. అప్పటికే మృతి చెందడంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కెమెరా చోరీ కేసులో ఇద్దరు మైనర్ల అరెస్టు

ఎంవీపీ కాలనీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కెమెరా చోరీ కేసులో ఇద్దరు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 22న మద్దిలపాలెం కాకతీయ ఫంక్షన్ హాల్లో జరిగిన వివాహంలో మహ్మద్ ఇషాక్ తన అనుచరులతో కలసి ఫొటోలు తీస్తున్నాడు. పక్కన పెట్టిన రూ. 1.5 లక్షల విలువైన కెమెరా, పరికరాలు కనిపించకపోవడంతో ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ద్వారకా సీఐ చక్రధరరావు, ఎంవీపీ ఎస్ఐ రవికుమార్ దర్యాప్తు చేసి, ఇసుకతోట కూడలి వద్ద ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కెమెరా, పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకరిపై పాత కేసులున్నాయి. ఆ కేసుల్లో రూ.1,820, సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఏఎస్ఐ కిశోర్‌బాబు, సిబ్బంది హరిప్రసాద్, జగత్‌కిరణ్, సాయి, అప్పలరాజు, రాజేష్‌లను ఉన్నతాధికారులు అభినందించారు.

80 కిలోల గంజాయి పట్టివేత


పోలీసులకు పట్టుబడిన గంజాయి

ఆనందపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి 80 కిలోల స్వాధీనం చేసుకున్నట్టు సీఐ చింతా వాసునాయుడు తెలిపారు. వెల్లంకి కంచరాపు కళ్లాల వద్ద శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తుండగా బొలేరో వ్యాన్‌లో వస్తున్న వారు పరారయ్యే ప్రయత్నం చేశారు. దీంతో ఎస్ఐ శివ, సిబ్బంది పట్టుకుని తనిఖీ చేయగా 80 కిలోల గంజాయి లభించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులకు చెందిన కొర్ర శివ, దుక్కరి రమణమూర్తి, వందల సూరిబాబు, తూర్పు గోదావరి జిల్లా ప్రత్తిపాడుకు చెందిన సోమశెట్టి లోవరాజులను అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉక్కు ఉద్యమం తీవ్రతరం చేయాలి

» ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.వెంకట సుబ్బయ్య

సీతంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం పబ్లిక్ రంగ సంస్థగా కొనసాగించడానికి విస్తృత ప్రాతిపదికన ప్రజా సంఘాలను ఐక్యం చేసి ఉద్యమాలు తీవ్రతరం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దయ్యే వరకు ఏఐటీయూసీ కలిసి వచ్చే అన్ని సంఘాలను ఐక్యం చేసి ఉద్యమించాలన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జిల్లా ఏఐటీయూసీ విస్తృత సమావేశాన్ని సంఘం ప్రతినిధి ఎం.మన్మథరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన ఎస్.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రద్దుచేసిన 29 చట్టాలు తిరిగి అమలు జరిగే వరకు దీర్ఘకాలిక ఉద్యమానికి ఏఐటీయూసీ శ్రేణులు సిద్ధంకావాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులు, స్కీమ్ వర్కర్స్ సమస్యలపై నిరంతరం పోరాటం నిర్వహించాలని జిల్లా ఏఐటీయూసీ సమితి నిర్ణయించిందని, సమావేశానికి 38 సంఘాల నుంచి ప్రతినిధులు ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సమితి ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ, కార్యదర్శి పడాల రమణ పాల్గొన్నారు.

జగదాంబ
DOLBY ATMOS LASER 4K
11.00 AM, 2.30 PM, 6.30 PM, 10.00 PM
Ticket Rates 100/-, 70/-



ANDHRA JYOTHI CLASSIFIEDS

FLAT FOR SALE
★ 3 BHK, East facing, furnished, 1800 sft 3 yrs old & 2BHK, 900 sft, East facing, 10 yrs old, Sujatha nagar Ph: 8328305699.
AJV_251784

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమర్పించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact : 9963231176, 9966165093